ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



అనంతపురం

జిల్లా వార్తలు

బుధవారం 8 మే 2024

ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం | 43.0 28.0



గుంతకల్లులో నిర్మాణం పూర్తికాని టిడ్కో ఇళ్లు

సొంతిల్లు..! ఆత్మస్థైర్యాన్ని ఇచ్చే ఆస్తి..! ఆత్మగౌరవాన్ని నిలబెట్టే ఆలయం..! చిన్నపాటి గుడిసె కానీలే..! అది సొంతమైతే చాలు. ఉంటే తింటాం.. లేదంటే కాసిన్ని నీళ్లు తాగి ఓ మూలన పడుకుంటాం..! మనల్ని అడిగేదెవరు..? అందుకే.. ప్రతి ఒక్కరి కల.. సొంతిల్లు..! ఇది ఆస్తిమాత్రమే కాదు..! అంతకు మించి..! అందుకే.. పక్కా ఇళ్లను నిర్మించి ఇస్తామని, ఇంటి స్థలం ఇస్తామని ఏ పార్టీ హామీ ఇచ్చినా.. ఓటర్లు నమ్మి ఆదరిస్తారు. అందలం ఎక్కిస్తారు. ఇక తమ కల నెరవేరుతుందని ఊహల్లో తేలియాడుతారు. 'ప్రభుత్వం ఇంత ఖర్చు చేస్తుంది.. మీరు కూడా కొంత జతచేయండి' అని పాలకులు చెబితే.. అప్పో సప్పో తెచ్చి ఇస్తారు. దరఖాస్తు చేసేందుకు, జాబితాలో తమ పేరు ఉందో లేదో చూసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. 'సార్.. సార్..' అని బతిమాలుతారు. కానీ.. ఎన్నికల హామీ ఓ వంచన అని.. తమ కల కలగానే మిగిలిపోతుందని తెలిస్తే.. పేద, మధ్యతరగతి జనం తల్లడిల్లిపోతారు.

(అనంతపురం సిటీ/గుత్తి/గుంతకల్లు/టౌన్/పామిడి)





ఇది తప్పు జగన్..!

- నిరుపయోగంగా వేలాది టిడ్కో ఇళ్లు
- టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిందని వివక్ష

పేదల ఇంటిపై రాజకీయం

ఎందుకిట్ల చేశావ్..?

టీడీపీ హయాంలో ప్రారంభించిన టిడ్కో ఇళ్ల పట్ల వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లూ కక్షసాధింపు ధోరణిని ప్రదర్శించింది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే ఉమ్మడి జిల్లాలోని 50,914 ఇళ్లపై గొడ్డలి వేటు వేసింది. ఏమాత్రం ఆలోచన చేయకుండా, 34,642 ఇళ్ల నిర్మాణాన్ని రద్దు చేసింది. రివర్స్ టెండరింగ్‌కు వెళ్లి.. 16,272 ఇళ్లను మాత్రమే కట్టిస్తామని ప్రకటించింది. కానీ ఈ ఐదేళ్లలో ఆ పనికూడా చేయలేదు. నిర్మాణ పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఎన్నికలు సమీపిస్తుండటంతో టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల నుంచి వ్యతిరేకత వస్తుందని భావించి.. ఒక్క తాడిపత్రి మాత్రమే కొన్నింటిని ప్రారంభించింది. ఇక్కడ 5,184 టిడ్కో ఇళ్లు ఉండగా.. అందులో వెయ్యి ఇళ్లకు పైపై పనులు చేసి, రంగులు వేయించి.. మూడు నెలల క్రితం ప్రారంభించింది. ఇందులో కూడా లబ్ధిదారులకు 370 ఇళ్లను మాత్రమే అప్పగించింది.

- అనంతపురం, గుత్తి, పామిడి, గుంతకల్లు, రాయదుర్గం, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, హిందూపురం ప్రాంతాల్లో టిడ్కో ఇళ్ల పరిస్థితి దయనీయంగా మారింది. టీడీపీ హయాంలో 80 శాతానికి పైగా నిర్మాణాలు పూర్తయిన చోట కూడా ఈ ఐదేళ్లలో మిగిలిన 20 శాతం పనులను కూడా వైసీపీ ప్రభుత్వం చేపట్టలేదు. కాంట్రాక్టర్లకు రూ.70 కోట్ల బకాయిలను వైసీపీ ప్రభుత్వం చెల్లించలేదు.
- అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గ పరిధిలోని గుత్తి పట్టణవాసులకు నేమతాబాదు వద్ద టీడీపీ హయాంలో 384 టిడ్కో ఇళ్లను కేటాయించారు. అప్పట్లో 96 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క అడుగు కూడా ముందుకు కదలలేదు. దీంతో ఇళ్ల చుట్టూ ముళ్ల పొదలు పెరిగిపోయాయి.
- గుంతకల్లు పట్టణంలోని దోనిముక్కల రోడ్డులో టిడ్కో ఇళ్ల నిర్మాణం పనులు నత్తనడకగా సాగుతున్నాయి. టీడీపీ హయాంలో 45 టిడ్కో బ్లాక్‌లు మంజూరయ్యాయి. 30 బ్లాక్‌ల పనులు పూర్తి అయ్యాయి. 15 బ్లాక్‌ల పనులు జరుగుతున్నాయి. పెయింటింగ్, వైరింగ్, టైల్స్ పనులు ప్రారంభం కాలేదు. సీసీ రోడ్డు కోసం కంకర వేసి వదిలేశారు. విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. కొన్ని బ్లాక్‌లు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి. ఖాళీ మద్యం బాటిళ్లతో నిండిపోయాయి.
- పామిడి పట్టణంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి 2018 ఫిబ్రవరి 26న అప్పటి ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ భూమిపూజ చేశారు. రూ.151.70 కోట్లతో 2,599 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. 300 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన 1,040ఇళ్లు, 365 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన 1,299 ఇళ్లు, 430 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన 260 ఇళ్లు మంజూరయ్యాయి. ఈ ఇళ్ల నిర్మాణం దాదాపు 70 శాతం పూర్తయ్యింది. మరిన్ని ఇళ్ల కోసం ఉంచిన ఇనుప కడ్డీలు, తలుపులు, టైల్స్ చోరీ అయ్యాయి. ఈ ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి.



అనంతపురం నగర శివారులో నిర్మించిన టిడ్కో గృహ సముదాయం

అప్పు చేసి డబ్బు చెల్లించా..

మాది అనంతపురం. హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మాదీ పేద కుటుంబం. సొంతిల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటున్నాం. టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లను ప్రకటించడంతో మా ఓనర్ దగ్గర అప్పు చేసి నా వాటాగా రూ.75 వేలు చెల్లించాను. ఆరేళ్లు గడిచినా ఇంటిని కట్టించి ఇవ్వలేదు. డిపాజిట్ కూడా వెనక్కు ఇవ్వలేదు. చేసిన అప్పునకు వడ్డీ చెల్లిస్తూనే ఉన్నాను.

- ఓ బాధితుడి ఆవేదన

ఆశలు ఆవిరి

టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తక్కువ బడ్జెట్‌తో ఇళ్లను నిర్మించి ఇస్తామని చెప్పడంతో పట్టణ పేదలు సంతోషపడ్డారు. లబ్ధిదారులు తమ వాటా డబ్బులు చెల్లించేశారు. సుమారు రూ.300 కోట్ల విలువైన పనులు వేగంగా సాగాయి. ఇంతలోనే ఎన్నికలు వచ్చాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ క్షణం నుంచి టిడ్కో ఇళ్లకు గ్రహణం పట్టింది. టీడీపీ హయాంలో చేపట్టిన పనుల రద్దు, రివర్స్ టెండరింగ్‌కు వెళ్లడం టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు శాపంగా మారింది. వైసీపీ ప్రభుత్వం తీరుపై లబ్ధిదారుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో కాస్త తగ్గి.. 16,272 ఇళ్లను కట్టించి ఇస్తామని ప్రకటించింది. మిగిలిన వారికి డిపాజిట్ సొమ్ము వెనక్కి ఇస్తామని చెప్పింది. కానీ.. ఇవ్వాల్సిన రూ.33 కోట్లలో పైసా కూడా ఇవ్వలేదు. వైసీపీ ప్రకటించిన 16,272 ఇళ్లలో ఎక్కువ శాతం పనులు టీడీపీ హయాంలోనే పూర్తి అయ్యాయి. మిగిలిన పనులను పైపైన పూర్తి చేసి.. మమ అనిపించారు. కానీ తాడిపత్రిలో వెయ్యి ఇళ్లు మినహా.. ఏ ఒక్కరికీ అప్పగించలేదు.



పామిడిలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి ఏర్పాటు చేసిన ఇనుప కడ్డీలను అపహరించిన దృశ్యం

టీడీపీ వస్తే కట్టిస్తుందేమో..

మాది అనంతపురం. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాను. టిడ్కో ఇంటి కోసం రూ.50 వేలు చెల్లించాను. సొంతిల్లు వస్తుందని నేను, నా కుటుంబ సభ్యులు ఎంతో సంబరపడ్డాం. వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ఆశలు ఆవిరయ్యాయి. అధికారులను అడిగితే ఏమీ చెప్పడంలేదు. ఈసారి టీడీపీ అధికారంలోకి వస్తే మాకు ఇల్లు కట్టించి ఇస్తుందని అనుకుంటున్నాం.

- మరో బాధితుడి ఆశ



గుత్తిలో నెర్రెలిచ్చిన స్లాబ్



గుత్తిలో అపార్టుమెంటు గచ్చులోని టైల్స్‌ను పెకిలించి తొలగించిన దృశ్యం

రాంపురంలో రాళ్లదాడి

- రెచ్చిపోయిన వైసీపీ మూకలు
- అడ్డొచ్చిన పోలీసులపైనా దాడికి యత్నం
- పరిటాల సునీత ప్రచారాన్ని అడ్డుకునే కుట్ర



పరిటాల సునీత ప్రచారంలో రాళ్లురువ్వుతున్న వైసీపీ వర్గీయులు

ధర్మవరం రూరల్, మే 7: రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు రౌడీయిజానికి దిగాయి. కనగానపల్లి మండలం రాంపురం గ్రామంలో టీడీపీ కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి పరిటాల సునీత మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఆమెకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆమె రోడ్ షోకు భారీగా జనం తరలిరావడంతో జీర్ణించుకోలేని వైసీపీ వర్గీయులు మిద్దెలపైకి ఎక్కి రాళ్లు రువ్వారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత ఏర్పడింది. వైసీపీకి చెందిన కొందరు యువకులు మిద్దెలపైకి ఎక్కి మీసాలు దువ్వుతూ.. తొడలు కొడుతూ దమ్ముంటే రావాలని సవాలు విసిరారు. అక్కడే ఉన్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తన సిబ్బందితో మిద్దెలపైకి వెళ్లి రాళ్లు రువ్వుతున్నవారిని అడ్డుకున్నారు. ఆ సమయంలో ఎస్ఐ, కానిస్టేబుళ్లపై కూడా వారు దాడికి యత్నించారు. టీడీపీవారితోపాటు పోలీసులను సైతం దూషించారు. దీంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి లాఠీకి పనిచెప్పారు. గ్రామానికి స్పెషల్ పార్టీ పోలీసులు చేరుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వైసీపీ వర్గీయులు రాళ్లు విసురుతున్న సమయంలో పరిటాల సునీత కలుగజేసుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సంయమనం పాటించాలని సూచించారు. ఓటమి భయంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ఇలాంటి చర్యలకు ఉసిగొల్పుతున్నారని ఆమె విమర్శించారు. రాళ్లదాడికి పాల్పడిన ముగ్గురు వైసీపీ వర్గీయులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



పోలీసుల ముందే మీసం తిప్పుతూ తొడకొడుతున్న వైసీపీ కార్యకర్త

మార్పు కనిపిస్తోంది..!

పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద ఆంక్షలు.. వైసీపీ టెంట్లను తొలగించిన పోలీసులు





జూనియర్ కాలేజీ వద్ద పోలీసులు, పోలీసులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం టౌన్, మే 7: పోలీసుల తీరులో మార్పు వస్తోంది. అనంతపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం వద్ద మంగళవారం ఆంక్షలు పెట్టారు. సీఐలు తమ సిబ్బందితో ఉదయమే అక్కడికి చేరుకుని.. వైసీపీ వర్గీయులు ఏర్పాటు చేసుకున్న టెంటును తొలగించాలని సూచించారు. అక్కడ ఎవరూ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. టీడీపీ వాళ్లను కూడా పంపించారు. ఆ సమయంలో అక్కడ ఉన్న వైసీపీ నాయకుడు వెన్నపూస రవీంద్ర రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అయినా పోలీసులు నిక్కచ్చిగా వ్యవహరించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అక్కడికి వచ్చి పోలీసులను ప్రశ్నించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేస్తున్నామని పోలీసులు స్పష్టం చేయడంతో అక్కడున్న టెంటు, ఫర్నీచర్‌ను తీసుకెళ్లారు. అధికార పార్టీవారు నాలుగు రోజులుగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. కానీ డీజీపీ, డీఐజీ, డీఎస్పీపై వేటు పడటంతో పోలీసులలో మార్పు వచ్చిందని అక్కడున్నవారు చర్చించుకున్నారు.

మేం నమ్మం జగన్..!

- వైసీపీకి అన్ని వర్గాలు దూరం
- తేలిపోయిన 'మా నమ్మకం నువ్వే జగన్'
- సీఎం బేల మాటలతో వైసీపీ అభ్యర్థుల్లో నైరాశ్యం
- కూటమికి పట్టం కట్టేందుకు సిద్ధమౌతున్న జనం



అనంతపురం, మే 7(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కసిగా మార్చుకొని ఓటుతో బుద్ధి చెప్పేందుకు జిల్లా ప్రజానీకం సమాయత్తమవుతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాకు ఒరిగిందేమీ లేదన్న అభిప్రాయానికి అన్ని వర్గాల ప్రజలు వచ్చారు. 'మా నమ్మకం నువ్వే జగన్' నుంచి.. 'నిన్ను నమ్మం జగన్' అనే పరిస్థితికి వచ్చారు. అడిగినందుకు ఒక్క చాన్స్ ఇచ్చామని.. ఐదేళ్లలో జిల్లాకు ఏం వెలగబెట్టారని ప్రశ్నిస్తున్నారు. పేరూరు, భైరవాన్‌తిప్ప ప్రాజెక్టులను పూర్తి చేసి కృష్ణా జలాలు ఇచ్చారా..? హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తి చేసి సాగునీరిచ్చారా...? హెచ్ఎల్సీని ఆధునికీకరించారా..? ఒక్క పరిశ్రమనైనా తెచ్చి.. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారా..? చిన్న పరిశ్రమలను ప్రోత్సహించి ప్రయోజనాలు చేకూర్చారా..? నా ఎస్సీ.. నా బీసీ.. నా ఎస్టీ... నా మైనార్టీ అని చెప్పుకోవడమే తప్ప.. ఆ వర్గాల కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు ఒక్క పైసా నిధులు విదిల్చారా..? ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను అమలుపరిచి బడుగు వర్గాలకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చారా..? ముస్లింలకు టీడీపీ హయాంలో అమలు చేసిన దుల్హాన్, రంజాన్ తోఫా తదితర పథకాలు ఇచ్చారా..? అని ప్రశ్నలు సంధిస్తున్నారు. బీపీఎస్ పథకం రద్దు చేసి పేద పిల్లల జీవితాలతో ఆడుకుంది వాస్తవం కాదా...? అన్న క్యాంటీన్లను ఎత్తేసి పేదల నోటికాడ ముద్ద తీసింది వాస్తవం కాదా..? డ్రిప్, స్ప్రింక్లర్లపై సబ్సిడీ ఎత్తేసి రైతులను ముంచలేదా..? బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల పథకాలను రద్దు చేసి.. ఆ వర్గాల బతుకులను చీకట్లోకి నెట్టింది మీరు కాదా అని నిలదీస్తున్నారు. జిల్లా అభివృద్ధికి ఒక్క పైసా ఇవ్వలేదని మండిపడుతున్నారు.

వైసీపీ అభ్యర్థుల్లో అడుగంటిన ఆశలు

వైసీపీ మేనిఫెస్టో ఆ పార్టీ అభ్యర్థుల ఆశలను ఆవిరి చేసింది. వారు అభద్రతాభావంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ తరుణంలో జగన్ ప్రసంగంలో బేలమాటలు వస్తున్నాయి. దీంతో వైసీపీ అభ్యర్థులు గెలుపుపై ఆశలు వదులుకుంటున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. దేనికైనా సిద్ధమన్న నోటితో జగన్ బేలమాటలు మాట్లాడటం ఆ పార్టీ అభ్యర్థులను మరింత నైరాశ్యంలోకి నెట్టింది. ఎన్నికలు సక్రమంగా జరుగుతాయనే నమ్మకం రోజురోజుకు సన్నగిల్లుతోందని సీఎం జగన్ వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లోనేకాకుండా ఆ పార్టీ అభ్యర్థుల్లోనూ తీవ్రస్థాయిలో చర్చకు తెరలేపింది. వైనాట్ 175 అనే నినాదంతో ఎన్నికల బరిలోకి దిగిన జగన్ స్వరం.. రేపల్లె, మాచర్ల, బందరు సభల చిన్నబోయింది. ఇది అభ్యర్థులను మరింత కలవరపాటుకు గురిచేస్తోంది. ఏడెనిమిది నెలల క్రితం బటన్ నొక్కిన సొమ్మును పోలింగ్‌కు వారం రోజులు ముందు విడుదల చేయాలని భావించారు. అయితే ఎన్నికల కమిషన్ ఆ సొమ్ము విడుదలకు అంగీకరించలేదు. దీన్ని సాకుగా చూపి ఓట్లు దండుకునేందుకు జగన్ చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. ఏడు నెలల క్రితం పంట నష్టపోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ము ఎప్పుడు విడుదల చేయకూడదు..? పోలింగ్‌కు ఐదు రోజుల ముందు విడుదల చేయాలా..? ఇది ఓటర్లను ప్రలోభ పెట్టడం కాక మరేమిటి..? అని అన్ని వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

కూటమికే పట్టం..



'మీ బిడ్డ పాలన.. చంద్రబాబు పాలనలో జరిగిన తేడాను గమనించే ఓటు వేయండి' అని సీఎం జగన్ బటన్ నొక్కుడు సభల్లోనూ, సిద్ధం సభల్లోనూ, మేమంతా సిద్ధం సభల్లోనూ పదే పదే చెబుతున్నారు. ఇదే ఆ పార్టీ అభ్యర్థులకు శాపంగా మారుతోంది. తేడాను గమనించామని, అందుకే ఎక్కువ మేలు చేసిన టీడీపీ కూటమి వైపే ఉంటామని అంటున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉద్యోగులు, యువత, కార్మికులు, రైతులకు ఆశించిన స్థాయిలో మేలు జరగలేదు. పరిశ్రమలు తీసుకురాలేదు. ఉద్యోగాలు ఇవ్వలేదు. ఇసుక అక్రమ రవాణాతో నిర్మాణరంగ కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఉద్యోగులకు గత ప్రభుత్వంలో 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చారు. వైసీపీ పాలనలో జీతాలే సరిగా ఇవ్వలేదు. రైతులకు పెట్టుబడి సాయం మినహా.. ఎలాంటి లబ్ధి చేకూర్చలేదు. ఇవన్నీ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు. వైసీపీ పాలన కంటే.. గతంలో టీడీపీ కూటమి పాలనలోనే మేలు జరిగిందని అన్ని వర్గాలు అంటున్నాయి. అందుకే కూటమికే పట్టం కట్టాలనే నిర్ణయానికి జనం వచ్చారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కొనుగోలుకు అధికార పార్టీవారు ప్రయత్నించినా.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తిరస్కరించడం దీనికి నిదర్శనం.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 7: ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే గిరిజన విద్యార్థులు 2024-25 విద్యాసంవత్సరానికి జాతీయ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజనేయులు తెలిపారు. మాస్టర్స్ లెవల్, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ పరిశోధన ప్రోగ్రాం కోర్సులు చేయబోయే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ పథకం కింద 20 మంది గిరిజన విద్యార్థులకు జాతీయ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందజేస్తారని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు http://overseas.tribal.gov.in/ వెబ్‌సైట్‌ను సందర్శించి, అర్హతలు, సూచనలు తెలుసుకొని ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.



రోడ్‌షోలో నందమూరి వసుంధరాదేవి, లోకేశ్వరి, కుమారుడు శ్రీనివాసులు

సకుటుంబ సమేతం..

హిందూపురం, మే 7 : ఎన్నికల్లో గెలవడం కోసం ఓ వైపు అభ్యర్థులు ప్రచారం చేస్తుంటే.. మరోవైపు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, అనుచరులు కూడా దూసుకుపోతున్నారు. హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తరుపున ఆయన భార్య వసుంధరదేవి, కుమార్తెలు నారా బ్రాహ్మిణి, తేజశ్విని, నందమూరి బాలకృష్ణ సోదరి లోకేశ్వరి, కుమారుడు శ్రీనివాసులు, వసుంధర సోదరుడు ప్రసాద్ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. స్వర్ణాంధ్ర సహకార యాత్రలో భాగంగా నియోజకవర్గాల్లో నందమూరి బాలకృష్ణ పాల్గొంటుండగా ఇక్కడ వసుంధరదేవితోపాటు కుటుంబసభ్యులు, బంధువులు ప్రచారం నిర్వహిస్తున్నారు. వైసీపీ అభ్యర్థి దీపికతోపాటు ఆమె భర్త, బంధువులు, ప్రచారంలో పాల్గొంటున్నారు. పెనుకొండ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి సవిత ఓవైపు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతుండగా ఆమె భర్త వెంకటేశ్వర్లు మరోవైపు మండలాలను చుట్టేస్తున్నారు. వారి బంధువులుకూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. వైసీపీ అభ్యర్థి ఉషశ్రీచరణ్‌తోపాటు ఆమె భర్త చరణ్‌రెడ్డి, బంధువులు కూడా ప్రచారంలో నిమగ్నమయ్యారు. హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి, సతీమణి, కుమారుడు, బంధువులు ప్రచారంలో పాల్గొంటున్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి పల్లె సింధూర ప్రచారంలో ముందుకెళ్తుండగా ఆమె మామ పల్లె రఘునాథ్‌రెడ్డి, భర్త పల్లె కృష్ణకిషోర్ కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇక్కడ కూడా వైసీపీ అభ్యర్థి దుద్దేకుంట శ్రీధర్‌రెడ్డితోపాటు సతీమణి, కుటుంబ సభ్యులు ప్రచారంలో పాల్గొంటున్నారు. కదిరిలో తెలుగుదేశం అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, ఆయన సతీమణి యశోదాదేవి ప్రచారంలో దూసుకెళ్తున్నారు.



ఎన్నికల సభలో మాట్లాడుతున్న బాలకృష్ణ కూతురు తేజశ్విని

అన్నదమ్ముల సవాల్..!

వైసీపీ నుంచి విశ్వ, కాంగ్రెస్ తరపున మధు

ఉరవకొండలో ఆసక్తికర రాజకీయం



మధుసూదన్‌రెడ్డి



విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: ఉరవకొండ శాసనసభ నియోజకవర్గ ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. గత ఎన్నికల్లో కలసిమెలసి ప్రచారం చేసిన అన్నదమ్ములు ఈ ఎన్నికల్లో బద్ధ శత్రువులయ్యారు. వైసీపీ అభ్యర్థిగా విశ్వేశ్వరరెడ్డి బరిలో ఉండగా, కాంగ్రెస్ పార్టీ తరపున విశ్వ సోదరుడు మధుసూదన్‌రెడ్డి పోటీలో నిలిచారు. 2004 నుంచి విశ్వేశ్వరరెడ్డికి చేదోడు వాదోడుగా ఉన్న మధు ఈ ఎన్నికల్లో అన్నకు ప్రత్యర్థిగా మారారు. కాంగ్రెస్ నుంచి పోటీచేసి గెలవాలని కాకుడా, తన సోదరుడిని ఓడించాలన్న లక్ష్యంతో మధుసూదన్‌రెడ్డి బరిలో నిలవడం గమనార్హం. అన్నదమ్ములిద్దరికీ పొసగకపోవడంతో మూడేళ్లుగా విరోధులుగా మారారు. ఈ నేపథ్యంలో గత సంవత్సరం వైసీపీ కార్యకర్తల సమావేశంలో విశ్వేశ్వరరెడ్డిపై మధు విమర్శలు చేయడంతో అతడిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. స్తబ్ధతగా ఉన్న మధు అన్నపై కక్షతో పీసీసీ చీఫ్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అన్నదమ్ములిద్దరూ వేర్వేరు పార్టీలు తరపున పోటీ పడుతుండడటంతో ఈ ఎన్నికల్లో టీడీపీకి కలిసి వస్తుందన్న చర్చ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వైసీపీ ఓట్లు చీలుస్తారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా శాసనమండలి సభ్యుడు శివరామిరెడ్డి కూడా వైసీపీ తరపున ప్రచారం చేయడంలేదు. ఆయనతో పాటు ఆయన వర్గీయులు కూడా నియోజకవర్గంలో ఎక్కడా ఎన్నికల ప్రచారంలో పాల్గొనకపోవడం గమనార్హం. ఆయన వర్గీయులు శివరామిరెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి పోటీ చేస్తున్న గుంతకల్లు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఉరవకొండ మేజర్ పంచాయతీలో వైసీపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీ వార్డు మద్ధతుదారులు ఐదుగురు టీడీపీలోకి చేరారు. ఉరవకొండలో మరికొంత మంది వైసీపీ అసమ్మతి నాయకులు టీడీపీ గూటికి చేరే అవకాశాలు ఉన్నాయని చర్చసాగుతోంది. ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీ ఉండడటంతో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. గత ఎన్నికల ఫలితాలను గమనిస్తే అతి తక్కువ ఓట్ల తేడాతోనే ఎమ్మెల్యేగా గెలుపు సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీలో శివరామిరెడ్డి వర్గం విశ్వకు ముఖం చాటేయడం, సొంత సోదరుడు మధు కాంగ్రెస్ నుంచి పోటీలో ఉండడం తదితర కారణాలతో ఈసారి టీడీపీ విజయం తథ్యమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అక్కడ చైతన్యం ఎక్కువ..?



రాళ్ల అనంతపురంలో పోలీసు కవాతు

కంబదూరు మండలంలోని ఆ గ్రామాలలో ప్రచారం చేసే సమయంలో ఏ పార్టీ అభ్యర్థులైనా ఆచితూచి అడుగులేస్తారు. సమస్యలపై ప్రశ్నించే చైతన్యం అక్కడి ప్రజల్లో ఉండటమే దీనికి కారణం. ఒకప్పటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన అచ్చంపల్లి, చెన్నంపల్లి, కురాకులపల్లి, అయ్యంపల్లి, రాళ్ల అనంతపురం, నర్సీపురం, రాళ్లపల్లి తదితర గ్రామాలలో సమస్యలపై రాజకీయ నాయకులను నిలదీసిన సంఘటనలు చాలా ఉన్నాయి. సమస్యలను పరిష్కరిస్తారా..? లేదా..? అని ఇక్కడి ప్రజలు సూటిగా ప్రశ్నిస్తారు. మాజీ ఎమ్మెల్యే శారదమ్మను రాళ్ల అనంతపురంలో మావోయిస్టులు అప్పట్లో ఓసారి నిర్బంధించారు. ఈ మండలంలో పలువురు నాయకులను అప్పట్లో మావోయిస్టులు ఎత్తుకువెళ్లి.. పద్ధతిగా ఉండాలని హెచ్చరించి పంపిన సంఘటనలు ఉన్నాయి. కురాకులపల్లిలో గత ఎన్నికల ప్రచార సమయంలో ఇరువర్గాల నిలదీతలు, ఫిర్యాదులు తారస్థాయికి చేరి.. రాళ్లదాడుల వరకూ వెళ్లాయి. ఇప్పుడు మావోయిస్టుల ప్రభావం లేకపోయినా.. ఆ చైతన్యపు వాసనలు మాత్రం పోలేదు. కొందరు మాజీ నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. వివిధ పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. సున్నితమైన ఈ గ్రామాలపై పోలీసుల నిఘా కూడా ఎక్కువగా ఉంది.

- కళ్యాణదుర్గం

ఎస్సీ, ఎస్టీ ఓటర్లకు రక్షణ

అనంతపురం అర్బన్: షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (దౌర్జన్యాల నిరోధక) చట్టం మేరకు ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీన వర్గాల ప్రజలను ఎన్నికల్లో తాము చెప్పిన అభ్యర్థికి ఓటు వేయాలని, మరో వ్యక్తికి ఓటు వేయకూడదని లేదా ఆ వర్గాల వారు అభ్యర్థిగా నిలబడకూడదని బలవంతం చేసినా, బెదిరించినా, హెచ్చరించినా అలాంటి వ్యక్తులు శిక్షార్హులవుతారు. ఈ నేరాలకు 6 నుంచి 10 ఏళ్ల వరకు జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తారు. బలహీన వర్గాల ఓటర్లు ముఖ్యంగా ఎస్సీలు, ఎస్టీలు తదితర ఓటర్ల విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది.

రసవత్తరంగా ధర్మవరం పోరు



ధర్మవరం పట్టణ ముఖచిత్రం



- ఇసుక, మట్టి, భూకబ్జాలపై జనాగ్రహం
- మార్పు కోరుకుంటున్న ప్రజలు
- ఎమ్మెల్యే కేతిరెడ్డి తీరుపై విమర్శలు
- సత్యకుమార్‌యాదవ్, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మధ్యే పోటీ

ధర్మవరం



ధర్మవరం నియోజకవర్గంలో ఈసారి పోటీ రసవత్తరంగా మారింది. కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రధానంగా పోటీలో ఉన్నారు. వీరిద్దరి మధ్య పోటాపోటీ నెలకొంది. ధర్మవరం నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పటి నుంచి 15సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో 1983, 1985, 1989, 1994, 2004, 2014లో టీడీపీ జెండా ఎగిరింది. 1955, 1962, 1972, 1978, 1999, 2009 కాంగ్రెస్, 2019లో వైసీపీ గెలిచింది. నియోజకవర్గంలో ధర్మవరం పట్టణంతో పాటు ధర్మవరంరూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలు 290 ఉన్నాయి. 35 సెక్టార్లు, 35 రూట్స్ ఉన్నాయి. మొత్తం ఓటర్లు 2,45,758 మంది ఉండగా ఇందులో పురుషులు 1,21,764 మంది, మహిళలు 1,23,974 మంది, థర్డ్ జండర్ 20 మంది ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాలో రూ.వందల కోట్లు..!

ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు రీచ్ నుంచి ఇసుకను తోడేసి బత్తలపల్లి నల్లబోయనపల్లి వద్ద డంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచి పట్టపగలే కర్ణాటకకు తరలిస్తున్నారు. కర్ణాటకలో టిప్పర్ రూ.70వేలకు వరకు అమ్ముకుంటున్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో రేషన్ బియ్యం, గుట్కా, మట్టి తదితర వాటిని కూడా ఎమ్మెల్యే అనుచరులు అక్రమంగా రవాణా చేసి కోట్లలో దండుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

స్థలం కనిపిస్తే కబ్జాలే

నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు, అనుచరులు స్థలాలు కనిపిస్తే కబ్జాలు చేస్తారని ప్రజలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు పేర్కొంటున్నారు. ఎమ్మెల్యే తుంపర్తి గ్రామ ఎస్సీలకు చెందిన 20 ఎకరాలు బెదిరించి తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో పాటు అక్కడే మరికొన్ని భూములను తన కుటుంబసభ్యుల పేరిట నకిలీ పట్టాలు సృష్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యేతోపాటు నియోజకవర్గంలో ఆయన అనుచరులు కూడా ప్రభుత్వ భూములు, అసైన్డ్, డీకేటీ భూములను సైతం వదలడంలేదని, కబ్జాలు చేస్తున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. గుడ్‌మార్నింగ్ పేరుతో వార్డు, గ్రామాల్లో సైతం ఖాళీ స్థలాలు కనిపిస్తే కబ్జాలు చేసేస్తున్నారని ప్రచారం సాగుతోంది.

సొంత పార్టీలో ఎమ్మెల్యేపై వ్యతిరేకత

స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి సొంత పార్టీలో వ్యతిరేకత ఉంది. ఇటీవల వైసీపీకి చెందిన బలమైన నేతలు ధర్మవరం పట్టణానికి చెందిన వైసీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిర్రాజు నగేశ్, బత్తలపల్లికి చెందిన కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాశ్‌బాబు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణయాదవ్, చందారాఘవ తదితరులు బీజేపీలోకి చేరారు. దీంతో కూటమి బీజేపీ అభ్యర్థి గెలుపు సునాయాసమవుతుందని వారు ధీమాగా ఉన్నారు. దీనికి తోడు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, టీడీపీ అధినేత చంద్రబాబు ధర్మవరం పర్యటన కూడా కూటమి అభ్యర్థికి కలిసి వస్తుందని అంచనా వేస్తున్నారు.

బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ బలాలు

- సత్యకుమార్‌యాదవ్ బీజేపీ జాతీయస్థాయి నాయకుడిగా ఉండటం.
- కేంద్రంలోని పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఉండటం.
- ముఖ్యంగా నియోజకవర్గంలో బీసీ కార్డు బలంగా ప్రజల్లోకి వెళ్లడం.
- వైసీపీ నుంచి బలమైన నేతలు బీజేపీలో చేరడం.
- ఏదైన అనుకుంటే సాధించేవరకు పట్టువదలని విక్రమార్కుడు అన్న పేరు.

బలహీనతలు

- ధర్మవరానికి ఎన్నికల ముందు రావడం.
- ప్రజల్లో కొత్తవ్యక్తిగా ప్రచారం జరగడం.
- ప్రత్యక్ష ఎన్నికల్లో మొదటిసారి పోటీ
- నాన్‌లోకల్ అన్న అభిప్రాయం.

ఎమ్మెల్యే కేతిరెడ్డి బలాలు

- జగన్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు
- స్థానికంగా అందుబాటులో నిత్యం ఉండటం
- తనకంటూ ప్రత్యేక బలాన్ని చేకూర్చుకోవడం

బలహీనతలు

- చేనేత క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి అమలుచేయకపోవడం.
- వైసీపీలో వ్యతిరేకత, బలమైన నేతలు పార్టీని వీడడం.
- ప్రభుత్వ అసైన్డ్, డీకేటీ భూములు కబ్జాలు చేయడం.
- ఎదిరించిన వారిపై దాడులు, అక్రమ కేసులు బనాయించడం.

గురువుల జేబుకు చిల్లు

జగన్ ప్రభుత్వ నిర్వాకంతో ఆర్థిక ఇబ్బందులు
పాఠశాలలకు ఎస్ఎంసీ నిధుల విడుదలలో మొండిచేయి
పైసా ఇవ్వకుండానే విద్యా సంవత్సరం ముగింపు

కళ్యాణదుర్గం: జగన్ ప్రభుత్వం చెత్త రికార్డుతో 2023-24 విద్యాసంవత్సరాన్ని ముగించింది. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పాఠశాలల నిర్వహణకు ఒక విద్యా సంవత్సరం పైసా ఇవ్వకుండానే బడులకు సెలవులు ఇచ్చింది. పదిన్నర నెలల పాటు బడుల నిర్వహణకు గురువులే తమ జేబులోని డబ్బులు వెచ్చించాల్సి వచ్చింది. విద్యుత్ చార్జీల భారం మోయలేక వారు తిప్పలు పడాల్సి వచ్చింది. పాఠశాలల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని పాఠశాల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇచ్చిన హామీ నెరవేరలేదు. ఫలితంగా విద్యుత్ శాఖ నుంచి అందిన నోటీసులకు భయపడి విద్యుత్ బిల్లులను ప్రధానోపాధ్యాయులే చెల్లించారు. చివరకు సుద్దముక్కకు కూడా జగన్ ప్రభుత్వం పైసా ఇవ్వలేదు. తెల్లకాగితాలు, రికార్డు పుస్తకాలు, చీపుర్లు, ఇతర సామగ్రికి సైతం గురువులే సొంత డబ్బులు వెచ్చించాల్సి వచ్చింది. గత విద్యాసంవత్సరంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) గ్రాంట్ కింద ఇవ్వాల్సిన నిధులలో 50 శాతమే ఇచ్చారు. ప్రస్తుతం ముగిసిన విద్యాసంవత్సరంలో పైసా ఇవ్వలేదు. దీంతో ఆ డబ్బులు వస్తాయా లేదా అన్న అనుమానాన్ని గురువులు వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సొంత డబ్బులు రూ. 1.20 లక్షల వరకు వెచ్చించారు. కంబదూరు మండలంలోని ఓ పాఠశాలలో పని చేస్తున్న మరో హెచ్ఎం రూ. 10 వేలు సొంత డబ్బులు వెచ్చించి విద్యుత్ బకాయిలు చెల్లించారు. ఇక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రూ. 50 వేలు నుంచి రూ. 1.50 లక్షలు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రూ. 10 వేలు నుంచి రూ. 25 వేలు వరకు జేబుల్లో నుంచి ఖర్చుచేశారు. గత నెలలో విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించకుంటే ఫ్యూజులు పీకేస్తామని విద్యుత్ శాఖ అధికారులు నోటీసులిచ్చారు. దీంతో విద్యుత్ లేకపోతే బడి నడవదని భావించి హెచ్ఎం లు వాటిని చెల్లించారు. బకాయిలు వుంటే జరిమానాలు ఎక్కువ పడుతున్నాయనే భయంతో ఎక్కువ మంది విద్యుత్ బిల్లులు చెల్లించి ఎస్ఎంసీ గ్రాంట్ల కోసం ఎదురుచూశారు. గత యేడాదికి సంబంధించి 45 పాఠశాలలకు రూ. 50 లక్షల వరకు బకాయిలు రావాల్సి వుంది. ప్రధానోపాధ్యాయులు జేబులు ఖాళీ చేసిన ప్రభుత్వాన్ని ఇప్పుడే చూస్తున్నామని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

హామీ మరిచిన మంత్రి

నాడు-నేడు కింద పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసిన తరువాత విద్యుత్ బిల్లులు మోయలేని విధంగా వున్నాయని ఉపాధ్యాయ సంఘాల నాయకులు గతేడాది జూలైలో మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలల విద్యుత్ చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుందని, మీరు బిల్లులు చెల్లించవద్దని హెచ్ఎంలకు మంత్రి హామీ ఇచ్చారు. ఆ మాటలు నమ్మి గతేడాది ఆగస్టు నుంచి పాఠశాలలు విద్యుత్ బకాయిలు చెల్లించలేదు. పాఠశాల నిర్వహణకు విద్యుత్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్న ఉత్తర్వు ఇప్పటి వరకు జారీ చేయలేదు. దీంతో తమకు ఎలాంటి ఉత్తర్వు రాలేదని, బకాయిలు చెల్లించాల్సిందేనని విద్యుత్ శాఖ ప్రధానోపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడంతో చేసేదేమీ లేక గత నెలలో ఎక్కువ మంది చెల్లించారు.



టీడీపీతోనే శాంతియుత పాలన

అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ



విడపనకల్లులో మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

గుంతకల్లు, మే 7: రాష్ట్రంలో పెరిగిపోయిన అరాచకాలు, దౌర్జన్యాలకు చరమగీతం పాడటానికి టీడీపీకి ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని అనంతపురం కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ ఓటర్లను కోరారు. మంగళవారం గుంతకల్లుకు వచ్చిన అంబికా పట్టణంలోని డీఆర్ఎం కార్యాలయం, డీజిల్ షెడ్, రైల్వే ఎలక్ట్రికల్ కార్యాలయంలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ తరఫున ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో నిలిచిన తనకు, గుమ్మనూరు జయరాంకు ఓట్లు వేసి గెలిపించాలంటూ అంబికా ప్రచారం చేశారు. అనంతరం మార్వాడీలు, ఆర్యవైశ్య ప్రముఖులతో భేటీ అయ్యి ఎన్నికల్లో తమకు మద్దతునివ్వాలని కోరారు. టీడీపీ ద్వారానే రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొంటుందని, వ్యాపార వర్గాలు స్వేచ్ఛాయుతంగా కార్యకలాపాలు నిర్వహించుకోగలరని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పత్తి హిమబిందు, ముష్టూరు తిమ్మప్ప, పూల రమణ, గోవిందరాజులు, ముష్టూరు బాలాజీ సింగ్, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని పార్లమెంట్ కూటమి అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వజ్రకరూరు మండలంలోని చాయాపురం, వజ్రకరూరులో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే కూటమి కలయిక అన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు ద్వారా భావితరాల మార్పునకు నాంది పలకాలన్నారు. ఈ నెల 13వ తేదీతో రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదిలిపోతుందన్నారు. దుర్మార్గపాలనను తరిమికొట్టేందుకు ఇక మిగిలింది నాలుగు రోజులే అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగభూషణం, దస్తగిరి, వలి, గురుమూర్తి, సర్పంచ్ మనోహర్, రఘు, నారాయణస్వామి పాల్గొన్నారు.

విడపనకల్లు: సీఎం జగన్ రాష్ట్ర ప్రజానికానికి ఈ ఐదేళ్ల కాలంలో నరకం ఏమిటి అనేది చూపించాడని అనంతపురం టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని విడపనకల్లు గ్రామంలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబికా మాట్లాడుతూ ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్‌కు, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అయిన తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజనేయులు, హనుమంతు, బీడీ చిన్న మారయ్య, భీమలింగప్ప, జనార్ధననాయుడు, చంద్రశేఖర్, డి. దేవేంద్ర, విజయ్‌శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంఎస్‌తో ఓటర్ స్లిప్

అనంతపురంరూరల్: క్షేత్రస్థాయిలో చాలా మంది ఓటర్ స్లిప్పులు అందలేదంటూ గాబారపడుతుంటారు. ఈ ఇబ్బంది లేకుండా ఈసారి ఎన్నికల సంఘం ఎస్ఎంఎస్ ద్వారా ఓటర్ స్లిప్ సమాచారం ఇచ్చింది. మొబైల్ ఫోన్‌లో ఈసీఐ అనిటైప్ చేసి స్పేస్ ఇచ్చి ఓటర్ ఐడీ నెంబరు ఎంటర్ చేసిన తరువాత 1950కి మెసేజ్ పంపిస్తే చాలు. సదరు ఓటరు పోలింగ్ బూత్ నెంబరుతోపాటు ఆ బూత్ ఓటర్ జాబితా, ఓటర్ సీరియల్ నెంబరుతో కూడిన మెసేజ్ వస్తుంది. పదిహేను సెకెన్లలో సమాచారం ఫోన్‌కు ఎస్ఎంఎస్ ద్వారా వస్తుంది.

మడకశిరను ఉద్యానహబ్‌గా తీర్చిదిద్దుతాం

- ప్రతి ఎకరాను సాగులోకి తీసుకువస్తాం
- వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి
- టీడీపీతోనే అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధి
- హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి



మడకశిర నియోజకవర్గంలో బీకే ప్రచారం

పుట్టపర్తి, మే 7(ఆంధ్రజ్యోతి): మడకశిరకు నేరుగా హంద్రీనీవా కాలువ ద్వారా ప్రతి చెరువును నింపి, ప్రతి ఎకరాను సాగులోకి తీసుకువస్తామని హిందూపురం లోక్‌సభ టీడీపీ కూటమి అభ్యర్థి బీకే పార్థసారథి హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మడకశిర నియోజక వర్గంలోని అగళి మండలంలో అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎస్‌రాజుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భగా బీకే మాట్లాడుతూ మడకశిర నియోజక వర్గంలో సారవంతమైన ఉద్యానవన పంటలకు సాగు అనుకూలమైన భూములు ఉన్నాయన్నారు. టీడీపీ హయాంలోనే మడకశిరకు గొల్లపల్లి నుంచి మడకశిర ఉప కాలువ ద్వారా హంద్రీనీవా నీరు ఇచ్చామన్నారు. చుట్టూ తిరిగివచ్చి మడకశిర ప్రాంతానికి నీరు చేరాలంటే ఆలస్యంతో చెరువుల్ని నింపలేని పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్య లేకుండా తురకాపట్నం నుంచి నేరుగా మడకశిరకు కాలువ తవ్వి నీరిస్తామని హామీ ఇచ్చారు. నీరు వస్తే ఉమ్మడి జిల్లాలోనే వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో మడకశిర ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కల సాకారం కావాలంటే రాష్ట్రంలో టీడీపీ కూటమి కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలో వస్తేనే సాధ్యమవుతుందన్నారు. అధికారంలోకి వచ్చాక ఏడాదిన్నరలోగా మడకశిరకు నేరుగా కాలువ నిర్మాణం చేపట్టి నీరు ఇస్తామని హామీ ఇచ్చారు. మడకశిర పల్లెల్లో బీకే ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి శ్రేణులు పాల్గొన్నారు. అదే విధంగా పుట్టపర్తి నియోజక వర్గం తలమర్లలో పుట్టపర్తి టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థి పల్లె సింధూరరెడ్డితో కలిసి బీకే రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ ఐదేళ్లగా రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసీపీకి ప్రజలు ఓటు ద్వారా ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీతోనే అన్ని వర్గాల సంక్షేమని, కూటమికి ఘన విజయం అందించాలని కోరారు.

పోలింగ్ తర్వాత..



అనంతపురం అర్బన్: పోలింగ్ పూర్తయిన తర్వాత స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు, వీవీ ప్యాట్లు తరలిస్తారు. పోలింగ్ ముగిసిన తర్వాత ప్రిసైడింగ్ అధికారి ఈవీఎం కంట్రోల్ యూనిట్ క్లోజ్ బటన్‌ను నొక్కాలి. దీంతో తర్వాత ఓటు వేసేందుకు ఆస్కారం ఉండదు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లను క్యారీయింగ్ కేసులలో ఉంచి సీలు వేస్తారు. ఆ సీళ్లపై పోలింగ్ ఏజెంట్లతో సంతకం చేయిస్తారు. పోలింగ్ రోజున పోలైన మొత్తం ఓట్లు, సీళ్లతోపాటు పోలింగ్‌కు ఉపయోగించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్ల క్రమ సంఖ్యల వివరాలున్న ఫారం - 17 సీ కాపీని పోలింగ్ ఏజెంట్లకు అందజేస్తారు. పోలయిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లను అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సమక్షంలో డబుల్ లాక్ సిస్టమ్‌లో భద్రపరిచి స్ట్రాంగ్ రూంకు పంపిస్తారు. ఈ సన్నివేశాన్ని వీడియో తీస్తారు. పోలింగ్‌స్టేషన్ నుంచి రిసెప్షన్ సెంటర్‌కు ఈవీఎంలు, వీవీ ప్యాట్లను తీసుకువెళ్లే వాహనాలను అనుసరించేందుకు అభ్యర్థులు లేదా ఏజెంట్లకు అనుమతిస్తారు. అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు స్ట్రాంగ్ రూం ముందు నిర్దేశించిన ప్రాంతంలో క్యాంప్‌లు వేసుకోవచ్చు. స్ట్రాంగ్ రూంలు నిత్యం సీసీటీవీ కవరేజ్‌లో ఉంటాయి.

48 గంటల ముందు..



అనంతపురం అర్బన్: పోలింగ్ ముగింపునకు 48 గంటల ముందు ప్రచారాలు బంద్ చేయాలి. అప్పటి నుంచి ఎలాంటి లౌడ్ స్పీకర్లను ఉపయోగించకూడదు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రచారం అనుమతి రోజుల్లో ప్రతిరోజు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు, ఇతర సౌండ్ పరికరాలను ఉపయోగించకూడదు. అలాగే బాల కార్మిక చట్టం మేరకు ఎన్నికలకు సంబంధించిన పనుల్లో పిల్లలను ఉపయోగించకూడదు. ఎన్నికల ప్రచారాలు, రాజకీయ చర్చల్లో దివ్యాంగులను కించపరిచేలా పదాలు వాడకూడదు.

మాస్ రూ. 5 వేలు.. క్లాస్ రూ.2 వేలు



అనంతపురం రూరల్ : ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఓటర్లకు డబ్బులతో ఎర వేసేందుకు అభ్యర్థులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో రాప్తాడు నియోజకవర్గంలో ఇప్పటికే ఓటర్లకు డబ్బులు ఎలా పంపిణీ చేయాలన్నదానిపై ఓ కొలిక్కి వచ్చినట్లు గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికార పార్టీ వారు మాస్ ఏరియాల్లో ఓటుకు రూ.5వేలు.. క్లాస్ ఏరియాల్లో ఓటుకు రూ.2వేలు చొప్పున పంపిణీ చేయడానికి సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ మేరకు సూచనప్రాయంగా స్థానిక నాయకులకు ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. వలంటర్లతో ఈ పంపిణీ తంతు సాగించాలని చూస్తున్నట్లు సమాచారం. వలంటీర్లకు ఎవరు ఏపార్టీ.. ఎవరు మధ్యస్థంగా ఉంటారన్న వివరాలు వారి దగ్గర ఉండటంతో.. వారితోనే డబ్బులు పంపిణీ చేయాలని అధికార పార్టీ నాయకులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అందుకే వారితో రాజీనామా చేయించినట్లు సమాచారం. వలంటీర్ల వెంట అధికార పార్టీ నాయకులు ఒకరిద్దరు వెళ్లి పని కానిచ్చేయాలని ప్లాన్ చేస్తున్నారు.

ఆర్‌ఓ తీరుపై అనుమానాలు..!

- గెజిటెడ్ సంతకం పెట్టి సీల్ వేయకుండానే ఓటింగ్
- తొలిరోజు రాప్తాడులో ఇలాగే బ్యాలెట్ పోలింగ్
- సంతకం లేకపోతే చెల్లవంటున్న కలెక్టర్
- ఫిర్యాదుకు సిద్ధమవుతున్న ఉపాధ్యాయులు



అనంతపురం టౌన్ : జిల్లా కేంద్రంలో ఓ రిటర్నింగ్ ఆఫీసర్ తీరుపై ఇటు ఉపాధ్యాయులు అటు తెలుగుదేశంపార్టీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మొదలైనప్పటి నుంచి అధికార వైసీపీకి మేలు చేయడానికి ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు ఆ కేంద్రంలో వినిపిస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల జాబితా జారీ చేయడంలోను, సీరియల్ నెంబర్లతో తయారు చేసిన జాబితా ఇచ్చి టీడీపీ వారికి కామన్ జాబితా ఇచ్చి పేర్లు చూసుకోవడానికి ఇబ్బందులు కలిగేలా చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు. పైగా ఆ పార్టీనేతలు, అనుకూల సంఘాల నాయకులు అక్కడే ఉండి ఓటర్లకు డబ్బులు పంచుతున్నా ఏమీ పట్టనట్లు సాగుతున్నారు. తాజాగా ఓట్ల పోలింగ్ విషయంలో కూడా ఉద్యోగ, ఉపాధ్యాయ ఓట్లు నిబంధనలకు విరుద్ధంగా వేయించినట్లు వారు ఆరోపిస్తున్నారు. ఇందుకు ఆదివారం చోటుచేసుకున్న వ్యవహారమే నిదర్శనమని అంటున్నారు. ఓటర్ల సంఖ్య పెరగడంతో పోలింగ్ సెంటర్లు పెంచాలని కోరుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో జూనియర్ కళాశాలలో మరో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 3వ కౌంటర్‌లో మధ్యాహ్నం 3-30 గంటలకు ప్రారంభం కాగా.. అపుడు అక్కడికి ఓటర్లు వెళ్లి ఓటు వినియోగించుకున్నారు. నిబంధనల మేరకు గెజిటెడ్ సంతకంతోపాటు అధికారి సీల్ వేయాల్సి ఉంటుంది. ఇక్కడ అధికారి కేవలం సంతకం పెట్టి ఓటు వేయించారు. విషయం తెలుసుకున్న కొందరు ఉపాధ్యాయులు వెళ్లి అడిగినా తానే ఆర్‌ఓ అనీ, తాను సంతకం పెడితే చాలు చెల్లుతుందని చెప్పి పంపించారు. దాదాపు 50 మంది వరకు అక్కడ అలాగే ఓటు వేశారంటున్నారు. ఇపుడు ఈ విషయం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళితే గెజిటెడ్ ఆఫీసర్ సంతకం పెడితే సరిపోదు.. సీల్ వేయాలనీ, అపుడే ఓటు చెల్లుతుందని స్పష్టం చేశారు. అలా లేకపోతే చెల్లని ఓట్లుగానే పక్కన పెట్టాల్సి వస్తుందంటున్నారు. శిక్షణలో పక్కాగా చెప్పామనీ, అలా చేసి ఉండుంటే మాత్రం తప్పకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అంటున్నారు. దీంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కావాలనే చెల్లనివిగా మార్చిన ఆర్‌ఓపై ఫిర్యాదు చేయడానికి ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు.

ఎరువుల ధరలు రెట్టింపు



భగవాన్, రైతు, నింబగల్లు

జగన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చేది కొంత, చెప్పేది కొండంత. ఐదేళ్లలో ఎరువుల ధరలు రెట్టింపు పెరిగాయి. కాలానుగుణంగా వచ్చే తెగుళ్ల కారణంగా రైతులకు ఏటా పెట్టుబడులు పెరుగుతున్నాయి. దీనికి తోడు ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఆదాయం కన్నా ఖర్చులే ఎక్కువ. లాభసాటిగా ఉండాల్సిన వ్యవసాయం నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. గతంలో వ్యవసాయ యంత్రాలు రాయితీపై ఇచ్చేవారు. రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. ఇప్పుడు వాటి ఊసేలేదు.

- ఉరవకొండ

ఐఓసీగా నిధులను దిగమింగారు..!

- వాటర్ ప్లాంట్ల ఏర్పాటులో వైసీపీ నాయకుల చేతివాటం
- నాసిరకం పరికరాలతో మూలనపడిన నీటి శుద్ధి ప్లాంట్లు





నక్కనదొడ్డి వద్ద ఏర్పాటైన ఐఓసీ గిడ్డంగి

గుంతకల్లు: తాగునీటి సమస్యను తీర్చడానికి ఐఓసీ ఇచ్చిన నిధులను అధికార పార్టీ నాయకులు అప్పనంగా దిగమింగి జేబులు నింపుకున్నారు. గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి పంచాయతీలో ఏర్పాటైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఇంధన గిడ్డంగి సంస్థ మూడు గ్రామాల్లో శుద్ధిచేసిన నీటిని అందించడానికి రూ. లక్షల నిధులను ఇచ్చింది. ఆ నిధుతో మూడు గ్రామాల్లో మూడు నీటిశుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయాలి. గ్రామస్థుల సంక్షేమం కోసం ఐఓసీ నుంచి నిధులు విడుదల కాగానే వైసీపీ నాయకులు రంగ ప్రవేశంచేసి నాసిరకం ప్లాంట్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. అనతి కాలంలోనే ఆ మూడు వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్లు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. దీంతో నక్కనదొడ్డి పంచాయతీలోని గ్రామాలకు తాగునీటి సమస్య ఏర్పడింది. సామాజిక సేవా కార్యక్రమం కింద ఐఓసీ ఇచ్చిన నిధులను కూడా దిగమింగిన వైసీపీ నాయకులు జేబులు నింపుకోగా, వారెంటీలు ఉన్నా కూడా ఆ ప్లాంట్లను పట్టించుకునేవారు కరువయ్యారు. ప్లాంట్ల కోసం వెచ్చించిన రూ. 25 లక్షల్లో దాదాపు సగం కాజేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇదీ జరిగింది..

గుంతకల్లు పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉన్న ఐఓసీ ఇంధన గిడ్డంగిలో భద్రతా ప్రమాణాలు లోపించాయంటూ వచ్చిన నివేదిక కారణంగా అక్కడ ఇంధన దిగుమతిని 2019లో నిలిపివేశారు. ప్రత్యామ్నాయంగా మండలంలోని నక్కనదొడ్డి గ్రామం వద్ద 81.75 ఎకరాల భూమిని సేకరించి రూ. 350 కోట్ల వ్యయంతో భారీ స్థాయిలో నూతన గిడ్డంగిని నిర్మించడానికి ఐఓసీ నిర్ణయించింది. రైతుల నుంచి భూమిని సేకరించిన సమయంలో స్థానికులకు ఐఓసీ కొన్ని హామీలిచ్చింది. అందులో భాగంగా ఈ పంచాయతీలోని నక్కనదొడ్డి, ఎన్.కొట్టాల, ఎన్.తండా గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామంటూ ఐఓసీ అధికారులు మాట ఇచ్చారు. చెప్పిన ప్రకారం 2021లో ఒక్కో వాటర్ ప్లాంటుకు రూ. 8.25 లక్షల చొప్పున మొత్తం దాదాపు రూ. 25 లక్షలు విడుదల చేసింది. అంతే ఈ పంచాయతీలోని వైసీపీ నాయకులు రంగప్రవేశంచేశారు. నాసిరకం నీటి శుద్ధి యంత్ర పరికరాలను తెచ్చి నక్కనదొడ్డి, ఎన్. కొట్టాల, ఎన్.తండా గ్రామాల్లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేశారు. ఈ మూడు ప్లాంట్లలో ఒకటి మూడు నెలలు, మిగతా రెండు ఆరు నెలలు తిరక్కుండానే మూలనపడ్డాయి.

వారెంటీ ఉన్నా వృథాయే..

నక్కనదొడ్డి పంచాయతీలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లకు సంవత్సరంపాటు వారెంటీలు ఉన్నాయి. కానీ అనతి కాలంలోనే ఇవి పనిచేయక మొరాయించాయి. మూడు ప్లాంట్లకు మోటార్లు పనిచేయకుండా పోయాయి. నక్కనదొడ్డి, ఎన్. కొట్టాల ప్లాంట్లు ఇప్పటికీ వృథాగా పడి ఉండగా, ఎన్.తండాలో ఓ వ్యక్తి ప్రజల వద్ద శుద్ధి చేసిన నీటికి డబ్బు వసూలు చేస్తూ దాన్ని నిర్వహిస్తున్నాడు. నక్కనదొడ్డి గ్రామంలో బోరులోకి మోటారు జారిపోయిందంటూ చేతులు దులుపుకున్నారు. ఎన్.కొట్టాలలోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. ఎన్.తండాలో ఓ వ్యక్తి ప్లాంటును రిపేరు చేయించి బిందె రూ. 5 లెక్కన అమ్ముతూ ప్లాంటును ఎలాగోలా నిర్వహిస్తున్నాడు. అలాగే నక్కనదొడ్డి గ్రామంలో ఐఓసీ ఏర్పాటు చేసిన ప్లాంటుకు సమీపంలోనే బోరు వేయించి, సొంతంగా వాటర్ ప్లాంటును ఏర్పాటు చేసి నీటిని ప్రజలకు అమ్ముతున్నాడు. కానీ లక్షలు వెచ్చించి వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన ప్లాంట్లు మాత్రం ఎందుకూ పనికిరాకుండాపోయాయి. ఈ ప్లాంట్లకు ఏర్పాటు చేసిన కొత్త మోటార్లను తొలగించేసి, పాత మోటార్లు బిగించారని, అందుకే కొన్నాళ్లు కూడా అవి పనిచేయకుండా పోయాయని, రూ. 25 లక్షల్లో సగం డబ్బు వైసీపీ నాయకులు నొక్కేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



ఎన్.తండాలో స్థానికుడు మరమ్మతు చేసిన ప్లాంటు

ఆరు నెలలు కూడా నడవలేదు



నక్కనదొడ్డి గ్రామంలోని బీసీ కాలనీలో ప్లాంటు ఏర్పాటు చేసిన ఆరు నెలలు గడవక ముందే పనిచేయకుండా పోయింది. మరమ్మతులు చేసేటప్పుడు మోటారు లోనికి జారిపోయిందని చెప్పి ప్లాంటును వృథాగా వదిలేశారు. లక్షలు గుమ్మరించి తెచ్చిన ప్లాంటును ఇలా ఎందుకూ పనికి రాకుండా చేయడం తగదు.

- యు. పార్వతమ్మ, నక్కనదొడ్డి



నక్కనదొడ్డిలో మూతబడిన వాటర్ ప్లాంటు

ప్లాంటును పునరుద్ధరించాలి



ప్లాంటు మూడేళ్ల నుంచి పనిచేయకుండా నిలిచిపోయింది. ప్రైవేటు వ్యక్తి తన సొంత ప్లాంటును పక్కనే ఏర్పాటు చేసినందున తాగునీరు లభిస్తోంది. లేదంటే కేవలం ఐఓసీ ప్లాంటుపై ఆధారపడి ఉంటే గుక్కెడు మంచినీరు దొరక్క అధ్వానమై పోయేవాళ్లము.

- గంగమ్మ, నక్కనదొడ్డి





చందకచర్ల, వైబీ హళ్లిలో మూతపడిన ప్లాంట్లు





టీడీపీ వారి నీరట..!

మినరల్ వాటర్ ప్లాంట్‌లను మూసేశారు

మడకశిర రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన శుద్ధనీటిని అందించడం కోసం తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పంచాయతీ కేంద్రాల్లో తొమ్మిది ఎన్టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. బిందె నీటిని రెండు రూపాయలకే అందించారు. వైసీపీ అధికారం చేపట్టిన తరువాత మడకశిర మండలంలోని వాటర్ ప్లాంట్లు కొన్ని సక్రమంగా పరిచేయకపోగా, మరికొన్ని మూతపడ్డాయి. వైబీ హళ్లిలో మంచి నీటి ప్లాంటు మూతపడి మూడు సంవత్సరాలతోంది. చందకచర్లలో ప్లాంటు మూతపడి దాదాపుయేడాది అవుతోంది. పంచాయితీలో నిధులు కొరత కారణంగా విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోవడం, చెడిపోయిన ప్లాంట్లను మరమ్మతులు చేయించకపోవడంతో కొన్ని మూతపడగా, మరికొన్ని అస్తవ్యస్తంగా నడుస్తున్నాయి. ప్రస్తుతం బిందె నీటిని రూ.5కు విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు వైసీపీ ప్రభుత్వపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నేతలూ.. గుర్తుందా..?

- మరో వరద రావాలేమో
- ఏడాదిన్నర దాటినా బ్రిడ్జి నిర్మాణం ఏదీ..?
- పూడిక తీయలేని దౌర్భాగ్యం
- ఆరో రోడ్డులో బ్రిడ్జికి ప్రతిపాదనలతోనే సరి

అనంతపురం క్రైం: విపరీత వర్షం.. నడిమివంక ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడిక, చెత్తా చెదారం...కాలువ నిండి కాలనీల్లోకి వరద నీరు.. 2022 అక్టోబరులో అనంతపురం నగర శివారులోని ఏడెనిమిది కాలనీలను ముంచెత్తింది. వరద నీరు ఇళ్లల్లో చేరడంతో ఆయా కాలనీల ప్రజలు అల్లాడిపోయారు. కనీసం నీరు, తిండి తెచ్చుకోలేని పరిస్థితి. ఇంట్లోని నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి. టీవీలు, ఫ్రిడ్జిలు, బైక్‌లు, కారులు పనికి రాకుండా పోయాయి. కొన్ని కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వచ్చింది. స్థానిక ప్రజల కళ్ల ముందు ఇంకా వరద దృశ్యాలు మెదులుతున్నాయి. ఆ వరదలు సృష్టించిన బీభత్సం ఇంకా కాలనీవాసులను భయానికి గురి చేస్తోంది. వర్షాకాలం వస్తోందంటే ఆ కాలనీవాసుల్లో వణుకు పుడుతోంది. ఆ సమయంలో సోమనాథ్‌నగర్, రంగస్వామినగర్, రజకనగర్, లెక్చరర్స్‌కాలనీ, శ్రీశ్రీ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు నరకం చూశారు. మూడు, నాలుగు రోజులు వరద నీరు వెళ్లలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

నేతలు, అధికారులు ఏం చేశారు...?

వరదలొచ్చిన సమయంలో ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్, ఎస్పీ, నగర కమిషనర్, ఇతర అధికారులు అక్కడికి వెళ్లారు. ప్రతి ఒక్కరూ ప్రజల ఇబ్బందులను ప్రత్యక్షంగా చూశారు. కానీ వారికి కేవలం నిత్యావసర సరుకులు, వసతి లేని వారికి ఆ సౌకర్యం కల్పించారంతే. కొన్ని రోజుల తరువాత ఏదో చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకు అతీగతీ లేదు. ఆ వరదలకు ప్రధాన కారణం నడిమివంకలో పూడిక తీయకపోవడమే. ఆక్రమణలతో అది మరింత కుంచించుకుపోతున్నా పట్టించుకునే దిక్కులేకుండా పోయింది. కాలువ పక్కనే ఉన్న ఇళ్లకు రక్షణగా గోడ ఎత్తును పెంచుతామని చెప్పిన అధికార పార్టీ వైసీపీ నేతలు ఆ విషయమే తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. వరదల తరువాత ఒక్కసారి కూడా పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో కాలువ నిండా పిచ్చి మొక్కలు, చెట్లతో నిండిపోయింది. ఆ పూడిక తీస్తే కానీ మాలో ఆందోళన తగ్గదని స్థానికులు వాపోతున్నారు.



వరద వచ్చిన మరో ప్రాంతంలో దుస్థితి

బ్రిడ్జి నిర్మాణమెప్పుడు...?

ఆరో రోడ్డులోని బ్రిడ్జి నిర్మిస్తామని స్థానిక ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్లు చెప్పుకొచ్చారు. కానీ వరదలొచ్చి 18 నెలలు గడిచినా బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన పడలేదు. అది ఇంకా ప్రతిపాదన దశలోనే ఉంది. అక్కడ ఎత్తు సరిగా లేకపోవడంతో ఓ మోస్తారు వర్షం కురిసినా ఇళ్లల్లోకి వర్షపు, మురుగు నీరు వచ్చేస్తాయి. ఆ బ్రిడ్జి కింద నీరు వెళ్లే అవకాశం కూడా లేదు. నగరానికి సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్ అడ్డంగా ఉంది. దీంతో అక్కడ బ్రిడ్జి నిర్మిస్తేనే శాశ్వత పరిష్కారం దక్కుతుందనడంలో సందేహం లేదు.



ఆరో రోడ్డులోని బ్రిడ్జికి అడ్డంగా ఉన్న తాగునీటి పైపులైన్



పూడిక తీయకపోవడంతో నడిమివంక ఇలా..



గడ్డితో పేరుకుపోయిన నడిమివంక

టీడీపీ గెలుపును ఎవరూ ఆపలేరు

కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్



టీడీపీలో చేరిన మైనార్టీలు



13వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న దగ్గుబాటి శ్రీ లక్ష్మి

అనంతపురం అర్బన్, మే 7 : అనంత అర్బన్‌లో టీడీపీ గెలుపును ఎవరూ ఆపలేరని కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక 46వ డివిజన్ పరిధిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటమి భయంలో వైసీపీ నాయకులు మతిస్థిమితం కోల్పోయి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. వైసీపీని అన్ని వర్గాల ప్రజలు ఇంటికి పంపాలన్న కసితో ఉన్నారన్నారు. ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్‌లో వైసీపీ నాయకులకు ఈ విషయం అర్థమైందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సరళ, నాయకులు పాల్గొన్నారు.

● టీడీపీకి తొగటవీర క్షత్రీయుల మద్దతు

స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో దగ్గుబాటి ప్రసాద్‌ను పలువురు తొగటవీర క్షత్రీయ కీలక నేతలు కలిసి సన్మానించారు. వారిని దగ్గుబాటి ప్రసాద్ పార్టీలోకి ఆహ్వానించారు. తొగటవీర క్షత్రీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసులు, కార్యదర్శి చింతా క్రిష్ణమూర్తి మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎం అయితేనే తమకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జాతీయ చేనేత, జౌళి ప్రజల సేవా అధ్యక్షుడు రమణ, మధు బాబు, హరీష్, ఎట్టిస్వామి, జగదీష్, పద్మావతి, ఇందిర, దుర్గా ప్రసాద్, ఈశ్వరప్రసాద్, కృష్ణ మోహన్, చింతా ప్రసాద్, అనంత కుమార్, సాయి ప్రసాద్, జయనారాయణలతోపాటు ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.

● వెయ్యిమంది మైనార్టీలు టీడీపీలో చేరిక

నగరం 21వ డివిజన్‌కు చెందిన నాయకుడు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో వెయ్యి మంది మైనార్టీలు టీడీపీలో చేరారు. వీరిని దగ్గుబాటి ప్రసాద్ టీడీపీలోకి ఆహ్వానించారు. పలువురు మైనార్టీలు మాట్లాడుతూ... చంద్ర బాబు అనంత అర్బన్ పర్యటనలో మైనార్టీలకు ఇచ్చిన హామీల నేపథ్యంలో తాము టీడీపీలో చేరామన్నారు.

● దగ్గుబాటి శ్రీ లక్ష్మి ప్రచారం

దగ్గుబాటి ప్రసాద్ సతీమణి దగ్గుబాటి శ్రీ లక్ష్మి స్థానిక 13 డివిజన్‌లోని ఉమా నగర్, ఎల్లమ్మ వీధి, రోశయ్య కొట్టాల, 33వ డివిజన్‌లోని నాయక్ నగర్ లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొ రేటర్ బల్లా పల్లవి, కురబ నారాయణస్వామి, చెరు కూరి శివ, రంగయ్య చౌదరి, లక్ష్మీనాయుడ మ్మ, రామకృష్ణ, బండి లక్ష్మన్న, బండికాళీ, శ్రీధర్ పాల్గొన్నారు.

● చమన్‌కు నివాళి

స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ కార్యాలయంలో మంగళవారం దివంగత మాజీ జడ్పీ చైర్మన్ చమన్ వర్ధంతిని పురస్కరించుకొని దగ్గుబాటి ప్రసాద్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. చమన్ సాబ్‌తో తనకున్న అనుబంధాన్ని ఎప్పటికీ మర్చిపోలే నన్నారు. కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు ఈరన్న, నాయకులు కూచి హరి, గంగారాం, ఇస్మాయిల్, ఫిరోజ్, అంజి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

● ఎస్సీ కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తా

అనంతపురంరూరల్ : ఎస్సీ కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తానని దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని రుద్రంపేట పంచాయతీలో ఉన్న ఎస్సీకాలనీ వాసులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో ఎస్సీ కాలనీలు అభివృద్ధికి నోచుకోలేదని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టాయని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే దళితుల బతుకులు బాగుపడుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస రెడ్డి, నాయకులు ఎస్ఎంబాష, భక్తవత్సలం నాయుడు, మారుతికుమార్, నాగభూషణం, జూటూరు సురేష్ బాబు, వెంకటరాముడు పాల్గొన్నారు.



దగ్గుబాటి ప్రసాద్‌ను సన్మానిస్తున్న తొగటవీర క్షత్రియులు



రుద్రంపేటలో నిర్వహించిన ఎస్సీల ఆత్మీయ సమావేశంలో దగ్గుబాటి ప్రసాద్

ఓటమి భయంతో రెచ్చగొడుతున్న ప్రకాశ్‌రెడ్డి

కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత





మాజీ మంత్రి పరిటాల సునీత ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు , పాముదాయిలో ప్రచారం నిర్వహిస్తున్న పరిటాల జ్ఞాన

ధర్మవరంరూరల్, మే 7: ఓటమి భయంతో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి గ్రామాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ... ఆ పార్టీ కార్యకర్తలు రాళ్లదాడులకు పాల్పడేలా చేస్తున్నారని కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తంచేశారు. కనగానపల్లి మండలం దాదులూరు, చంద్రాచర్ల, రాంపురం, కనగానపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రచారంలో ఆమె మాట్లాడారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేశానని, ఈ ఐదేళ్లలో ఏ ఒక్క గ్రామంలో ఎమ్మెల్యే అభివృద్ధి పనులు చేపట్టలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రకాశ్‌రెడ్డికి, జగన్‌రెడ్డికి ఓటు రూపంలో గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేశ్, కన్వీనర్ యాతం పోతలయ్య, బట్టా సురేశ్ చౌదరి, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, సర్పంచ్ అంకేప్రమీల రామకృష్ణ పాల్గొన్నారు.

● నేడు పలు గ్రామాల్లో ప్రచారం

రాప్తాడు : పరిటాల సునీత మండలంలోని బోగినేపల్లి, పాలచెర్ల, రాప్తాడు గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తు న్నట్లు మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు తెలిపారు. మధ్యాహ్నం 2:30 గంటలకు బోగినేపల్లి, 3:30 గంటలకు పాలచెర్లలో, రాప్తాడులో సాయంత్రం 5 గంటలకు ప్రచారం ఉంటుందన్నారు.

● వైసీపీ నుంచి టీడీపీలోకి...

అనంతపురంరూరల్ : రాప్తాడు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. అనంతపురం క్యాంపు కార్యాలయంలో పరిటాల సునీత, పరిటాల సిద్దార్థ సమక్షంలో వారు పార్టీలో చేశారు. అనంతపురం రూరల్ మండల కందుకూరు, కనగానపల్లి మండలం వేపకుంట, చెన్నమనాయునికోట, నెమలివరం, ఆత్మకూరు మండలం తలుపూరు, డి.కె.తండా, చెన్నేకొత్తపల్లి మండలం హరియన్ చెరువు, రాప్తాడు, ఇటికలపల్లి గ్రామాల నుంచి వైసీపీకి చెందిన వారు తెలుగుదేశం పార్టీలోకి చేరారు.

● ఆర్యవైశ్యుల మద్దతు

ఆత్మకూరు : స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు కార్తీక్ నందన్ అధ్యక్షతన నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం సభ్యుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. పరిటాల సునీతకు అండగా నిలుస్తామని ఆ సభ్యులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాయలసీమ రీజియన్ చైర్మన్ చంద్రబోస్, రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడు దినేష్, రాప్తాడు నియోజకవర్గం మండలాల ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు త్రిమూర్తి ప్రసాద్, నిరిగుప్ప, మురళి శంకర్, మేడా నాగమణి, టీడీపీ డివిజన్ నాయకురాలు నాగమణి పాల్గొన్నారు.

● పలువురి ప్రచారం

రాప్తాడు : మండల ఇన్‌చార్జ్ దర్మవరపు మురళి రాప్తాడు సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. కన్వీనర్ కొండప్ప, సర్పంచ్ తిరుపాలు, గోనిపట్ల శీనా, సాకే జయ రాముడు, కిష్టా, కొండప్ప, నారాయణస్వామి పాల్గొన్నారు.

అనంతపురంరూరల్ : పరిటాల పెద్ద కోడలు పరిటాల జ్ఞాన మండలంలోని సోముల దొడ్డి పంచాయతీ పాముదాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి ర ఘు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాము రాయి వెంకటేష్, ఎంపీటీసీ కలిమిశెట్టి లక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, రాము, సాయినాథ్ పాల్గొన్నారు. అలాగే మండలం లోని కట్టకిందపల్లి గ్రామంలో మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, నాయకులు నాగేంద్రరెడ్డి, ఆల మూరు సూరి ఇంటింటి ప్రచారం చేపట్టారు.



కనగానపల్లిలో గజమాలతో పరిటాల సునీతను సన్మానిస్తున్న అభిమానులు

వారితో టీడీపీకి ఎలాంటి సంబంధమూ లేదు



మాట్లాడుతున్న కోవెలమూడి రవీంద్ర

బుక్కరాయసముద్రం, మే 7: మండల ఎంపీపీ దాసరి సునీత, భర్త బుల్లే నారాయణస్వామి, శింగనమల మండల వైసీపీ మాజీ కన్వీనర్ పట్నం నాగేష్‌తో టీడీపీకి ఎలాంటి సంబంధమూ లేదని ఉమ్మడి జిల్లాల జోనల్ టీడీపీ కో-ఆర్డినేటర్ కోవెలమూడి రవీంద్ర వెల్లడించారు. మంగళవారం బుక్కరాయసముద్రంలో ఆయన మాట్లాడుతూ.. వీరు వైసీపీ నుంచి టీడీపీపై బుక్కరాయసముద్రం, శింగనమల మండలాల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందని, దీంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వైసీపీ హయంలో వీరు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసుల పెట్టించి మానసికంగా తీవ్రంగా వేధించారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, నియోజకవర్గం టీడీపీ పరిశీలకులు గుర్రప్ప నాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, కన్వీనర్ అశోక్, టీడీపీ నేతలు సాకే రామక్రిష్ణ, ఎస్‌నారాయణస్వామి, రవీంద్రా, కేశన్న, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

జోరుగా ప్రచారం : బుక్కరాయసముద్రం, రోటరీపురం గ్రామాల్లో ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుక్కరాయసముద్రంలో వైసీపీ నుంచి 150 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేశారు. అలాగే టీడీపీ జిల్లా నేత ఆలం వెంకట నరసా నాయుడు ఆధ్వర్యంలో నార్పల కొత్త బస్టాండ్ కాలనీలో వైసీపీకు చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

చికిత్స పొందుతున్న బండారు శ్రావణిశ్రీ

శింగనమల మే7: కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ వడదెబ్బ నుంచి ఇంకా కోలుకోలేదు మంగళవారం ఇంటి వద్దనే చికిత్స తీసుకున్నారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆమెను పరామర్శించారు.

పోక్సో కేసులో నిందితుడు రిమాండ్‌కు..

గార్లదిన్నె : మండలంలోని కల్లూరు కొండకింద మారుతి నగర్‌లో ఏడేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించి .. పరారీలో ఉన్న మురగన్ అనిల్‌కుమార్ తరిమెల క్రాస్ వద్ద ఉండగా పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. అతనిపై పోక్సో కేసు నమోదు చేశామని, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు

అనంతపురం సెంట్రల్ : ఐటీఐ కోర్సులు అభ్యసించేందుకు ప్రవేశా లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి జూన్ 10వరకు మొదటి విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులని, ఆసక్తిగల విద్యార్థులు https://iti.ap.gov.in/ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

రాప్తాడు, మే 7: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం రాప్తాడు తహసీల్దార్ మునిస్వామికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిష్టా, పక్కీర్‌రెడ్డి, నారాయణప్ప పాల్గొన్నారు.

శింగనమల : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని టీడీపీ నాయకులు మంగళవారం తహసీల్దార్ శోభన్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ కన్వీనర్ ఆదినారాయణ, వెంకటేశ్, మాసూలచంద్ర, సత్తి, బండి వెంకటనారాయణ, గుర్రం లక్ష్మినారాయణ, పెద్దన్న చెన్నయ్య ప్రతాప్, నెట్టికంటి పాల్గొన్నారు.

నవయుగ కాలనీలో నీటిఎద్దడి

అనంతపురం కల్చరల్, మే 7: స్థానిక నవయుగ కాలనీలో మూడు రోజుల నుంచి కొళాయిల ద్వారా తాగు నీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి మంగళవారం నాలుగు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారు. దాతలు ముందుకు వచ్చి కాలనీవాసులకు సహాయ సహకారాలందించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కవీన్ ఆదిత్య, కాలనీ సెక్రటరీ రాజు, నాగమణి, లక్ష్మి, రజియాభాను, ముంతాజ్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఇంకా ప్రలోభాలు

అనంతపురం టౌన్, మే 7: మారిన పోలీసుల పక్కనే వైసీపీ కోసం ప్రలోభాలకు దిగే పోలీసులూ కనిపించారు. 'వైసీపీకి ఓటు వేయండి.. ఓటుకు రూ.3 వేలు తీసుకెళ్లండి' అని ఎరవేశారు. అధికార పార్టీ అభ్యర్థికి ఓటు వేసినట్లు సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకొచ్చి చూపినవారికి నగదు ఇచ్చిపంపుతున్నారని టీడీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సచివాలయ ఉద్యోగులపై కొందరు కార్పొరేటర్లు నిఘా వేసి, వైసీపీకి అనుకూలంగా ఓట్లు వేయించేందుకు ప్రయత్నించారు. వారికి డబ్బులు అందజేసి, వైసీపీకి ఓటు వేయాలని ఒత్తిడి చేశారు.

పెరిగిన కౌంటర్లు.. : పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు భారీ సంఖ్యలో రావడంతో ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద గొడవలకు దారి తీసింది. ఓటింగ్ ఆలస్యం కావడం, కొందరి పేర్లు గల్లంతు కావడంతో వివాదాలు కొనసాగాయి. అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. దీంతో జిల్లా వ్యాప్తంగా మంగళవారం అదనపు కౌంటర్లను ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటికే చాలామంది ఓట్లు వేయడంతో జూనియర్ కాలేజీ కేంద్రం వద్ద రద్దీ బాగా తగ్గిపోయింది.



జూనియర్ కళాశాలలో ఓటు వేయడానికి వచ్చిన ఉద్యోగులు

పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలి

అనంతపురం టౌన్, మే 7: ఉద్యోగ జీవితంలో ఎన్నికల్లో పనిచేయడాన్ని ప్రతి ఒక్కరు చాలెంజ్‌గా తీసుకోవాలని, పోలింగ్ ప్రశాంతంగా సాగడానికి కృషి చేయాలని ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు విశ్రాంత ఐఏఎస్ రామ్‌మోహన్ మిశ్రా సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కలెక్టరు, ఎస్పీ ఆధ్వర్యంలో ఇక్కడ మంచి ఎన్నికల టీం ఉందని కొనియాడారు. ప్రత్యేకంగా శాంతి భద్రతల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముందుగానే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి.. అక్కడ పటిష్ఠభద్రత చర్యలు చేపట్టాలన్నారు. ఈ వారం ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎవరైనా ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కలెక్టరు వినోద్ కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్, అధికారులు పాల్గొన్నారు.

ఊరట

అనంతపురం అర్బన్ : జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం, రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. అనంతపురం, గుంతకల్లు, బెళుగుప్ప తదితర మండలాల్లో తేలిక పాటి వర్షం కురిసింది. వేసవి నేపథ్యంలో భానుడు భగభగలతో అల్లాడిపోయిన ప్రజలకు ఈ వర్షం ఒకింత ఊరట ఇచ్చింది. వర్షంతో పాటు ఈదులు గాలులు వేయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు చిమ్మ చీకట్లతో ఉండిపోయారు. ఓ మోస్తరు వర్షానికే పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రాంనగర్, మారుతీ నగర్‌లలో జలమయం అయిన ప్రాంతాలను కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ పరిశీంచారు.



మెరుపు వెలుగుల్లో నగరం



టవర్‌క్లాక్ వద్ద జోరు వాన





విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో చీకట్లో ఆర్టీసీ బస్టాండ్, తోపుడు బండ్ల వ్యాపారుల ఇక్కట్లు

బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ



అనంతపురం క్రైం, మే 7: అనంతపురం డీఎస్పీగా టీవీవీ ప్రతాప్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డీఎస్పీ వీర రాఘవరెడ్డిని ఎన్నికల కమిషన్ బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో గుంటూరు ఏసీబీ డీఎస్పీగా ఉన్న టీవీవీ ప్రతాప్‌ను నియమించింది. ఎన్నికల నిర్వహణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన విన్నవించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చమన్‌సాబ్‌కు ఘన నివాళి



ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు, అభిమానులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 7: జడ్పీ మాజీ చైర్మన్ దివంగత చమన్‌సాబ్ ఆరో వర్ధంతిని పురస్కరించుకొని కొత్తపల్లిలోని ఘాట్ వద్ద ఆయన కుటుంబసభ్యులు, అభిమానులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన సతీమణి రమీజా, తనయుడు, టీడీపీ యువ నాయకుడు ఉమర్ ముక్తార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమర్ ముక్తార్ మాట్లాడుతూ... నాన్న ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. నాన్న భౌతికంగా లేకపోయినప్పటికీ... అభిమానుల గుండెల్లో ఇంకా బతికే ఉన్నాడని అన్నారు. అనంతరం అన్నదానం నిర్వహిం చారు. కార్యక్రమంలో చమన్‌సాబ్ అభిమానులు, దూదేకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని బీఎస్పీ ఎంపీ అభ్యర్థి వినతి

అనంతపురం సెంట్రల్, మే 7: సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారానికి వెళ్తున్న తనపై కొందరు దుండగలు దాడి చేసేందుకు యత్నిస్తున్నారని, అందుకు తగిన రక్షణ కల్పించాలని అధికారులను కోరినట్లు బీఎస్పీ ఎంపీ అభ్యర్థి నారాయణప్ప మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దళితులు, ఇతర వర్గాలవారు ఎన్నికల్లో పోటీచేయడం గిట్టని అధికార పార్టీ ఇలాంటి దురాగతాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోకపోవడం లేదన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయ బోర్డులను చించివేసి అద్దాలను పగలగొట్టార న్నారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారికి, ఎస్పీకి ఫిర్యాదు చేసినా తగిన చర్యలు తీసుకోలేదని, దీంతో మరింత రెచ్చిపోయిన దుండగలు ఫోన్‌చేసి బెదిరించడం, భౌతికంగా అరాచ కాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తక్షణమే రక్షణ కల్పించకపోతే కేంద్ర ఎన్నికల అధికారిని, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు.

శిశుగృహలో ఉద్యోగుల వాగ్వాదం



శిశుగృహలో వాదిస్తున్న సోషల్ వర్కర్ లక్ష్మిదేవి

అనంతపురం విద్య, మే 7 : స్థానిక శిశుగృహలో సోషల్ వర్కర్ లక్ష్మిదేవి, మేనేజర్ దీప్తి, ఆయాలు, ఇతర సిబ్బంది మధ్య మంగళవారం వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతకాలంగా లక్ష్మిదేవి, ఇతర సిబ్బంది మధ్య ఆదిపత్యపోరు నడుస్తోంది. పేరెంట్స్ కౌన్సెలింగ్ రూమ్ గది తలుపు విషయంలో మంగళవారం ఈ గొడవ జరిగినట్లు సమాచారం. లక్ష్మిదేవి కేకలతో అక్కడ ఆశ్రయం పొందుతున్న నెలల చిన్నారులు భయపడి.. ఏడుపులు అందుకున్నారు. ఇక సోషల్ వర్కర్ లక్ష్మిదేవితో వాదించలేక... ఏఎన్ఎం, ఆయాలు, సిబ్బంది ఐసీడీఎస్ పీడీ కార్యాలయానికి వెళ్లి... పీడీ శ్రీదేవికి ఫిర్యాదు చేశారు. దీంతో పీడీ శిశుగృహకు వెళ్లారు. సోషల్ వర్కర్, మేనేజర్, ఇతర సిబ్బందితో జరిగిన విషయంపై లిఖిత పూర్వకంగా లేఖలు రాయించకున్నారు. ఈ ఘటనపై విచారణ చేస్తామని, బాధ్యులకు షోకాజ్ నోటీసులు ఇస్తామని పీడీ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

వైసీపీ తరపున మెప్మా అధికారి ప్రచారం

ఆర్పీలు, గ్రూపు సభ్యులతో మంతనాలు

అనంతపురం క్రైం, మే 7 : అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థికి ఓటేయాలని మెప్మాలో ఓ అధికారి ప్రచారం ఉధృతం చేస్తున్నారు. మెప్మాలో ఉన్న ఈ అధికారి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో పాటు సమీప బంధువునని చెప్పుకొంటున్నారు. వైసీపీకే ఓటేయాలని మెప్మాలో రీసోర్స్‌పర్సన్(ఆర్‌పీ)లకు, సంఘాల సభ్యులకు ఆయన సంకేతాలు పంపుతున్నారట. కార్యాలయంలో నేరుగా.. ఇతరుకు ఫోన్ చేసి మరీ ఓటేయాలని చెబుతున్నారట. సిబ్బందిని ఆయన ప్రలోభాలకూ గురిచేస్తున్నట్లు తెలిసింది.

హోం ఓటర్లను గుర్తించడంలో బీఎల్‌ఓల నిర్లక్ష్యం



సీకేపల్లిలో ఓటు హక్కు వినియోగించుకొంటున్న 102 ఏళ్ల తలుపుల అచ్చమ్మ

చెన్నేకొత్తపల్లి, మే 7: పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లలేని 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల కోసం ఎన్నికల కమిషన్ హోం ఓటింగ్ ప్రక్రియను ఏర్పాటు చేసింది. అలాంటి వారిని గుర్తించే బాధ్యత బీఎల్‌ఓలకు అప్పగించింది. అయితే వారిని గుర్తించడంలో బీఎల్‌ఓలు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మండలంలో వందల మంది ఉండగా... కేవలం 41 మందే ఉన్నారంటూ వారు నివేదికలు ఇచ్చారు. కాగా హోం ఓటింగ్ ప్రక్రియను మండలంలో ఎన్నికలు అధికారులు మంగళవారం చేపట్టారు. తమకు అందిన జాబితా ప్రకారం ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు.

మద్యం ప్యాకెట్ల స్వాధీనం

రామగిరి : పావగడ నుంచి ధర్మవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో కొత్త చెరువు మండలం అప్పలవాండ్లపల్లికు చెందిన ఓ వ్యక్తి 96 టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా.. మండల సరిహద్దున గల ఎగువపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని రామగిరి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

వైసీపీ తరపున వలంటీర్, ఉద్యోగుల ప్రచారం



వైసీపీకే ఓటేయాలని చూపుతున్న వలంటీర్

నార్పల,మే 7: మండలం సిద్దరాచెర్ల గ్రామంలో వలంటీర్ యామిని వైసీపీ తరపున మంగళవారం ప్రచారం నిర్వహించింది. ఏకంగా ఈవీఎం నమూనాతో వెళ్లి... వైసీపీకే ఓటు వేయాలని మరీ ప్రచారం చేసింది.

అనంతపురంరూరల్ : మండలంలోని కొడిమిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌రెడ్డి ఆదివారం రాత్రి నిర్వహించిన ప్రచారంలో సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో ఎ-1 ఫర్టిలిటీ విభాగంలో స్వీపర్లుగా కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న ఉద్యోగులు బండి లక్ష్మి, బ్యాళ్ల విజయలక్ష్మి పాల్గొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థికి పుష్పగుచ్చాలు అందజేస్తూ ఫోజులిచ్చారు.





ఎమ్మెల్యే అభ్యర్థితో బండి లక్ష్మి, బ్యాళ్ల విజయలక్ష్మి

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు

అనంతపురం టౌన్, మే 7: ఎన్నికలు నిర్వహిస్తున్న ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రోగ్రామ్ ఆఫీసర్లకు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.బీ. దేవి ఆదేశించారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇందుకు ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకొని సిబ్బందిని కేటాయించాలన్నారు. ఆ రోజున ఏ ఒక్కరికీ సెలవు ఇవ్వకూడదని, ఎవరైన విరుద్ధంగా వెళితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యులు సుజాత, ఓబులు, యుగంధర్, అనుపమజేమ్స్, రవిశంకర్ పాల్గొన్నారు.



వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారితో అమిలినేని సురేంద్ర బాబు



టీడీపీలోకి చేరిన వైసీపీ మహిళా కార్యకర్తలు

కళ్యాణదుర్గం ప్రజల కలలను నెరవేర్చుతాం

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని

కళ్యాణదుర్గం, మే 7: కళ్యాణదుర్గం ప్రజల కలలను నెరవేర్చడమే తన మొదటి కర్తవ్యమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మంగళవారం కళ్యాణదుర్గం మున్సిపాలిటీ 12వ వార్డుకు చెందిన 20 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరారు. బ్రహ్మసముద్రం మండలం భైరవాన్‌టిప్పకు చెందిన 11, కళ్యాణదుర్గం మండలం సిబాయి గ్రామానికి చెందిన 13, శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామానికి చెందిన పది, కళ్యాణదుర్గం మండలం విట్లంపల్లి గ్రామానికి చెందిన పది వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి వీరందరికీ అమిలినేని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అమిలినేని మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పడుతూ అపూర్వ స్వాగతం పలుకుతున్నారన్నారు. ప్రతి గ్రామంలోను టీడీపీకు ప్రజాబలం పరుగుతోందన్నారు. టీడీపీ వస్తేనే గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతాయనే నమ్మకం ప్రజల్లో బలంగా వినిపిస్తోందన్నారు. ఈ ప్రజాదరణ చూసి వైసీపీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కళ్యాణదుర్గం అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఎక్కడ చూసినా వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేసేవారే కనిపిస్తున్నారన్నారు. ప్రజల నుంచి వస్తున్న విమర్శలు చూస్తే నియోజకవర్గంలో వైసీపీ పరిపాలన ఏవిధంగా ఉందో అర్థమవుతుందన్నారు. నియోజవకర్గంలో టీడీపీకి ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానన్నారు. మున్సిపాలిటీ అంతా దుర్గంధమయంగా మారిందన్నారు. మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చి దిద్ది ఆదాయ వనరుగా మార్చడమే తన ప్రధాన ధ్యేయమన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అన్ని వర్గాల ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. కుటుంబానికి ఆర్థిక భద్రతతో పాటు భావితరాల భవిష్యత్తు అభివృద్ధి పథంలో వుండాలంటే విజన్ వున్న నాయకుడు చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. అందుకోసమే మనమందరం సమష్టిగా కృషిచేసి చంద్రబాబునాయుడును సీఎంగా చేసుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధిని ఆలోచించి సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. అప్పుడే మన ఊరు మన ప్రాంతం బాగుపడుతుందన్నారు. 13వ తేదీన ప్రతి ఓటరూ టీడీపీకి ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.



టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సురేంద్రబాబు

ఇంటింటికీ ఉచిత కొళాయి కనెక్షన్

● కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు

డీ.హీరేహాళ్, మే 7: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి ఉచిత తాగునీటి కనెక్షన్ అందిస్తామని కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం డీ.హీరేహాళ్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను అందించి ఓటు వేయాలని కోరారు. తొలుత గ్రామంలో ఉన్న దేవమ్మ, సుంకులమ్మ ఆలయాల్లో ఆయన కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాయకులు భారీ గజమాలతో కాలవ శ్రీనివాసులుకు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఐదేళ్లుగా చేసిన నియంత పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. జగన్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టి మళ్లీ టీడీపీని అధికారంలోకి తేవడం కోసం ప్రజలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ గెలుపు నల్లేరు మీద నడకగా ఉందన్నారు. గత టీడీపీ హయాంలో రాయదుర్గం నియోజకవర్గంలో వేలకోట్ల రూపాయలు నిధులు తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. తనను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు.

70 కుటుంబాలు టీడీపీలోకి చేరిక

డీ.హీరేహాళ్‌కు చెందిన 70 కుటుంబాలు టీడీపీలో చేరాయి. గవిసిద్ద, మారెన్న, వన్నూరుస్వామి, అనిల్, రంగలతో మరికొందరు చేరిన వారికి కాలవ శ్రీనివాసులు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

బొమ్మనహాళ్‌లో 50 కుటుంబాలు...

నేమకల్లు గ్రామానికి చెందిన 50 మంది వైసీపీ నుండి కాలవ శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలోకి చేరారు. టీడీపీ నాయకులు గాలి బసప్ప, శివప్ప, హనుమంతప్ప, దొణెప్ప, తిప్పేస్వామిల ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. కాలవ శ్రీనివాసులు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన బొమ్మలాట శివమ్మ, రామాంజనమ్మ, రామాంజనేయులు, ప్రకాష్, రేవన్న, హనుమంతరాయ, నాగరాజు మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మెచ్చుకొని టీడీపీలో చేరామన్నారు.



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కాలవ

కుటుంబీకుల ప్రచారం

కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ మంగళవారం బొమ్మనహాళ్ మండలంలోని ఏళంజి, కొత్తూరు, కానాపురం, దేవగిరిక్రాస్, గోనేహాళ్ గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదే విధంగా కాలవ శ్రీనివాసులు సతీమణి విజయలక్ష్మి డీ.హీరేహాళ్‌లో పెద్ద ఎత్తున మహిళలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారాన్ని చేపట్టారు. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అలాగే కూతురు కాలవ గౌతమి కణేకల్లు మండలంలోని నల్లంపల్లి, సొల్లాపురంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు.



కాలవ సమక్షంలో టీడీపీలో చేరిన యువకులు



డీ.హీరేహాళ్‌లో కాలవ విజయలక్ష్మితో మహిళల ప్రచారం

టీడీపీ హయాంలోనే కురుబలకు రాజకీయ ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న కేశవ్



కేశవ్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న ముస్లిం మైనార్టీలు

● ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మే 7: టీడీపీ హయాంలోనే కురుబలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ అన్నారు. పట్టణంలోని సత్యం కన్వెనల్ హాల్‌లో మంగళవారం కురుబల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి కేశవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు మునుపు కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కురుబసంఘం నాయకులు కంబళ్లు, కనకదాసు చిత్రపటాన్ని అందజేసి గజమాలతో కేశవ్‌ను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కురుబలకు ఎంపీ, ఎమ్మెల్యే సీటు చంద్రబాబు కేటాయించారన్నారు. బీసీలకు రాజ్యాధికారం టీడీపీతోనే ప్రారంభమైందన్నారు. రాజకీయ ప్రాధాన్యత ఇస్తున్నా కురుబలు రాజ్యాధికారం వైపు అడుగులు వేయడం లేదన్నారు. రాజకీయంగా ముందుండి ప్రోత్సహిస్తామన్నారు. ఉరవకొండ కురుబల కల్యాణమండపాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేసే బాధ్యత నాదన్నారు. కురుబసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ కురుబలు మాటిస్తే తప్పరన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొనకొండ్ల రాజేష్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తట్రగల్లు సుధాకర్, చాబాల ఈశ్వర్, జియో శ్రీన, రమేష్, ఈశ్వరయ్య, గోపాల్, చేజాల ప్రభాకర్, తిమ్మప్ప, నరేంద్ర, శరత్, అనిల్ పాల్గొన్నారు.

టీడీపీ వెంటే మైనార్టీలు: టీడీపీ వెంటనే మైనార్టీలు ఉంటారని ఆపార్టీ నాయకులు అల్లాబకాష్, రహంతుల్లా అన్నారు. పట్టణంలో పయ్యావుల కేశవ్‌కు మద్దతుగా మంగళవారం ప్రచారం చేశారు. ఖాదర్, సలాం, రఫీ, కిట్టు, యూనిస్ పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిక: వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి పెద్ద తండాకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. కౌకుంట్ల గ్రామంలో పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో సోమ్లానాయక్, కొర్రా ఆనంద్‌నాయక్, డాక్యనాయక్, ఎర్రిస్వామి నాయక్‌కు ఆయన పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

బెళుగుప్ప: మండలంలోని కోనంపల్లికి చెందిన వైసీపీ నాయకులు మంగళవారం పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలోకి చేరారు. ఆమిద్యాల, యర్రిస్వామి వన్నూరు స్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు పురుషోత్తమ్, సురేష్, సుధాకర్‌లు చేరగా పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. స్థానిక నాయకులు వెంకటేశులు, యర్రిస్వామి, మారెన్న, దాస్, యుగంధర్ పాల్గొన్నారు.



బెళుగుప్పలో టీడీపీలో చేరిన వారితో పయ్యావుల శ్రీనివాసులు

టీడీపీలోనే అన్ని కులాలకు సమన్యాయం: జయరాం

గుంతకల్లు, మే 7: టీడీపీలో మాత్రమే అన్ని కులాలకు సమన్యాయం లభిస్తుందని ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం ఉదయం పాతగుంతకల్లులోని కనకపేట వీధిలో పెద్ద సంఖ్యలో కురుబలు టీడీపీలోకి చేరారు. దాదాపు 70 కుటుంబాలు జయరాం సమక్షంలో పార్టీ కండువాలు ధరించి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. జయరాం మాట్లాడుతూ తాను ఆలూరు నియోజకవర్గంలో జనసంఖ్యను బట్టి వివిధ కులాలకు తగిన ప్రాధాన్యం, పదవులను ఇచ్చానన్నారు. ఇక్కడ కురబలు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారిని తప్పక దృష్టిలో ఉంచుకుంటానన్నారు. వైసీపీలో అన్యాయం జరిగిందని టీడీపీలోకి వచ్చారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీలోనూ, రాజకీయంగానూ తగిన గుర్తింపు నిస్తానని హామీ ఇచ్చారు. కురుబ సంఘం ఉపాధ్యక్షుడు రామప్ప, మదన్‌మోహన్, రామలక్ష్మన్న, వీరుపాక్షి, వీరన్న, మల్లేష్, రామాంజి, శేఖర్ చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో బండారు ఆనంద్, గుమ్మనూరు నారాయణ స్వామి, కేసీ హరి, డన్లప్ బాషా, పాండుకుమార్ పాల్గొన్నారు. అనంతరం వైసీపీ నాయకుడు ఫ్లయింగ్ అబ్దుల్లాను జయరాం పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

గుత్తి: పట్టణంలో ప్రజలు తాగునీటి కోసం పడుతున్న కష్టాలను తాను గుర్తించానని నీటి సమస్య లేకుండా పరిష్కారానికి కృషి చేస్తానని గుమ్మనూరు జయరాం అన్నారు. గుత్తి ఆర్ఎస్‌లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గంలోని మూడు మండలాలలో వార్ వన్ సైడ్ అయ్యిందన్నారు. వైసీపీ ఎమ్మెల్యే వెంకటరామి రెడ్డికి భయం పట్టుకుందన్నారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ, అబ్దుల్ వహాబ్, న్యాయవాది సోమశేఖర్, రమేష్ శ్రీకాంత్, కొనకొండ్ల సూరి పాల్గొన్నారు. అనంతరం ఆర్ఎస్‌లో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మల్లికార్జున గుప్త, నాయకులు సంపత్ కుమార్, మధుసూదన్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



గుత్తి ఆర్ఎస్‌లో మాట్లాడుతున్న గుమ్మనూరు



గుంతకల్లులో కురుబలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జయరాం

గుత్తిరూరల్: రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని గుమ్మనూరు జయరాం, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మాముడూరు గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన 30 కుటుంబాలకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బద్రివలి, చిన్నరెడ్డి యాదవ్, గుమ్మనూరు నారాయణ, సర్పంచు భరత్, జింకల నారాయణస్వామి పాల్గొన్నారు.

పామిడి: తెలుగుదేశం పార్టీ పాలనలోనే మహిళలకు రక్షణ అని గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. మండలంలోని ఎదురూరు, వంకరాజుకాలువ, కండ్లపల్లి గ్రామాల్లో మంగళవారం విస్తృత ప్రచారం చేపట్టారు. విజయభాస్కర్‌నాయుడు, సునీల్, సుంకప్ప, మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఎదురూరులో ప్రచారం చేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

నెలగొండలో వైద్య శిబిరం ఏర్పాటు

గుంతకల్లుటౌన్, మే7: మండలంలోని నెలగొండ గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నాగసముద్రం మెడికల్ అధికారి డాక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని తాగునీటి పైప్‌లైన్ లీకేజీ వల్ల ఆ నీరు తాగి కొంతమంది ఆసుపత్రి పాలైన సంగతి విదితమే. పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టామని ఆయన తెలిపారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 24 గంటల పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు.

బాధితులకు మెరుగైన వైద్య సేవలందించాలి: మండలంలోని నెలగొండ గ్రామంలో కలుషిత నీటి కారణంగా అస్వస్థతకు గురైన బాధితులకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలందించాలని అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ కోరారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నెలగొండ గ్రామస్థులను మంగళవారం పరామర్శించారు. బాధితులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. బండారు ఆనంద్, తలారి మస్తానప్ప, ముష్టూరు తిమ్మప్ప, కోడి శీన పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోసం మహిళల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన మహిళలు

యాడికి, మే 7: ఎండీయూ ఆపరేటర్ ప్రతినెలా తమ కాలనీకి వచ్చి రేషన్ బియ్యం ఇవ్వడం లేదని ఆగ్రహించిన మహిళలు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ నాగులకట్టవీధికి ఎండీయూ ఆపరేటర్ రావడం లేదన్నారు. గత నెల కూడా అధికారులకు ఫిర్యాదు చేశామని అయినా స్పందన లేదన్నారు.అధికారులు చర్యలు తీసుకొని వాహనం ద్వారా రేషన్ బియ్యం అందించాలని వారు కోరారు. కార్యాలయంలో అధికారులు ఎవరూ లేకపోవడంతో అక్కడి నుంచి వారు వెనుదిరిగారు.

నేడు కాలవ పర్యటన ఇలా...

రాయదుర్గం, మే 7: కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు బుధవారం బొమ్మనహాల్ మండలంలో ప్రచారం నిర్వహిస్తారు. ఉదయం 8 గంటలకు వన్నళ్లి, హొసళ్లిలో, 9.30 గంటకు దర్గాహొన్నూరులో, 11.30 గంటలకు గోవింద వాడ, మధ్యాహ్నం 3. గంటలకు సింగేపల్లిలో, సాయంత్రం 4 గంటలకు గోనేహాల్, 5 గంటలకు కణేకల్లు మండం బెనకల్లు, 6 గంటలకు 43 ఉ డేగోళం గ్రామంలో ప్రచారం చేస్తారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న వెంకటశివుడు యాదవ్, నాయకులు

గుత్తి, మే 7: వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు స్థానిక తహసీల్దారు భారతికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టం 2023 అక్టోబరు 31నుంచి జీఓ 512ను తీసుకువచ్చి అమల్లోకి తీసుకువచ్చారన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలో ఈ యాక్ట్‌ను అమలు చేయలేదన్నారు. ఈ యాక్ట్‌తో రైతుల భూములను కబ్జా చేయాలని జగన్‌రెడ్డి చూస్తున్నారని ఆరోపించారు.మండల కన్వీనర్ బద్రివలి, రంగారెడ్డి యాదవ్, నరసింహులు, సుధాకర్, వైకుంఠ పాల్గొన్నారు.

యాడికి: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని టీడీపీ నాయకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్ సుంకన్నకు వినతిపత్రం అందజేశారు. మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, ఆదినారాయణ, శేఖర్, శ్రీనివాసులు, నరసింహచౌదరి, విక్రమ్, విజయ్ ఉన్నారు.

బొమ్మనహాళ్: వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రెవెన్యూ అధికారులకు తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్రగుంట్ల వెంకటేశులు, టీడీపీ కన్వీనర్ బలరాంరెడ్డి, క్లస్టర్ కన్వీనర్ మాలపాటి ధనుంజయ రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు.

రాజకీయం మా ఇంట్లోనే పుట్టింది: జేసీపీఆర్

తాడిపత్రి టౌన్, మే7: రాజకీయం తమ ఇంట్లోనే పుట్టిందనీ, సచివాలయ సిబ్బంది వారి పని వారు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక తన నివాసంలో మంగళవారం ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు తమకు డూ ఆర్ డైగా ఉన్నాయన్నారు. ఇలాంటి సమయంలో సచివాలయ ఉద్యోగులు వైసీపీకి అనుకూలంగా పనిచేయడం తగదన్నారు. సచివాలయ ఉద్యోగులు వారి పని చూసుకోవాలని హితవు పలికారు.

రెండు బటన్లు నొక్కి.. సైకోను సాగనంపుదాం

బెళుగుప్ప, మే 7: రాబోవు ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు రెండు బటన్లు నొక్కి సైకో సీఎం జగన్ సాగనంపుదామంటూ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. అనంతరం పెళ్లిరోజు వేడుకలు నాయకులు, కార్యకర్తల మధ్య ఘనంగా జరుపుకున్నారు. కన్వీనర్ ప్రసాద్, తగ్గుపర్తి రాధాకృష్ణ, వన్నూరుస్వామి పాల్గొన్నారు.



టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న అంబికా

గుండెపోటుతో మత్స్యకారుడి మృతి

కూడేరు, మే 7: మండలంలోని కొర్రకోడు గ్రామానికి చెందిన కుంటెన్న (45) పీఏబీఆర్ డ్యాంలో చేపలు పడుతూ గుండెపోటు రావడంతో మృతి చెందాడు. స్థానికులు అందించిన మేరకు చేపలు పడుతూ జీవనం సాగిస్తున్న కుంటెన్న సోమవారం డ్యాం నీటిలో చేపలు వేటకు వెళ్లి ఒడ్డుకు వస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. సమీపంలోని మత్స్యకారులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య భీమక్క, ఇద్దరు పిల్లలు, ప్రస్తుతం ఆమె గర్భవతి. విషయం తెలుసుకున్న మత్స్యశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



మృతి చెందిన కుంటెన్న

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కుందుర్పి, మే 7: మండల కేంద్రానికి చెందిన రమేష్ (42) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన మేరకు రమేష్ 20 సంవత్సరాల క్రితం మహంతాపురం గ్రామానికి చెందిన రాధమ్మతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. భార్య రాధమ్మ కెంచంపల్లి గ్రామానికి చెందిన సమీప బంధువుకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వాళ్ల ఇంటికి వెళ్లింది. భార్యాభర్తల మధ్య చిన్న చిన్న మనస్పర్థలు వున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. రమేష్ టీడీపీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడు. సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొని భార్య దగ్గరికి వెళ్లాడు. అర్ధరాత్రి మృతి చెందినట్లు సమీప బంధువులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ వెంకటస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టమ్ నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి నారాయణప్ప ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



రమేష్ (ఫైల్)

వడదెబ్బతో వ్యక్తి మృతి



చిన్న పుల్లా రెడ్డి (ఫైల్)

యాడికి, మే 7: వడదెబ్బతో చిన్న పుల్లారెడ్డి (45) అనే వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం చిక్కేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు చిక్కేపల్లి గ్రామానికి చెందిన చిన్న పుల్లారెడ్డికి భార్య ఆదిలక్షుమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పుల్లారెడ్డి వ్యవసాయ కూలీపనులు చేసుకుంటూ జీవనం గడిపేవాడన్నారు. మంగళవారం గ్రామంలోనే భవన నిర్మాణ పనులకు వెళ్లాడని తెలిపారు. అక్కడ అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం యాడికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు చెప్పారని తెలిపారు.

అభివృద్ధి చూసి ఓటు వేయండి: అశ్మిత్‌రెడ్డి



రోడ్‌షోలో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

పెద్దపప్పూరు, మే7: టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటువేయాలని టీడీపీ, కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని వరదాయపల్లి, ధర్మాపురం, పెద్దపప్పూరు గ్రామాల్లో బహిరంగ సభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుంచి మండలంలో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకిరాగానే వాటిని పరిష్కరిస్తామన్నారు. అభివృద్ధికి మారుపేరుగా ఉన్న టీడీపీకి ఓటువేసి గెలిపించాలని ప్రజలను ఆయన అభ్యర్థించారు. జనసేన ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, తెలుగుయువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, నాయకులు బీసీ రామకృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్న నారాయణస్వామి, వెంకటశివారెడ్డి, నల్లప్ప, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి: కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన అంబికా లక్ష్మీనారాయణ, జేసీ అశ్మిత్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీనేత జేసీ పవన్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. మంగళవారం చిట్టూరు, చిత్రచేడు, దిమ్మగుడి, వీరన్నపల్లి, నాగలాపురం, కొండూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పుట్లూరురోడ్డు, సంజీవనగర్, మారుతీనగర్, రెడ్డివారిపాలెం ప్రాంతాల్లో మంగళవారం కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ప్రచారంలో కాకర్ల రంగనాథ, జయుడు, పాపిరెడ్డి, రంగనాథరెడ్డి, నాయుడు, పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కాకర్ల బ్రదర్స్‌ప్రచారం: మండలంలోని తెల్లమిట్టపల్లి, యాడికి మండలంలోని నిట్టూరు, కొత్తపల్లి గ్రామాల్లో మంగళవారం టీడీపీ సీనియర్ నాయకులు కాకర్ల రంగనాథ్, కాకర్ల జయుడు, కాకర్ల రంగనాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటువేసి జేసీ అశ్మిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

40కుటుంబాలు చేరిక: స్థానిక నివాసంలో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో మండలంలోని భోగసముద్రం, అయ్యవారిపల్లి, గదరగుట్టపల్లి గ్రామాల 40 వైసీపీ కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి జేసీపీఆర్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన సోమేశ్వరరెడ్డి, కనకం ప్రసాద్, భూమేశ్వర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రంగస్వామి ఉన్నారు.

నా కుమారుడిని ఆశీర్వదించండి: జేసీపీఆర్

వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న నా కుమారుడు జేసీ అశ్మిత్‌రెడ్డిని ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. మంగళవారం పట్టణంలోని అంజనేయస్వామిమాన్యంలో ఆయన ప్రచారం చేశారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి